బుధవారం
04-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 104
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి ముగ్గురిని వరించింది. ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాల్లో భాగంగా ఈ అవార్డును రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అమెరికాకు చెందిన పెర్రీ అగోస్తిని, జర్మనీకి చెందిన ఫెరెన్స్ క్రౌజ్, స్వీడన్‌కు చెందిన అన్నె ఎల్ హ్యులియర్‌కు ఈ ఏడాది నోబెల్ ప్రకటించారు.

2 లో

ఉక్కుపాదం

'న్యూస్‌క్లిక్' ఆఫీస్, జర్నలిస్టుల ఇళ్లలో సోదాలు

- వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, చక్రవర్తి అరెస్టు
- 100 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు
- తీవ్రంగా ఖండించిన ప్రతిపక్షాలు, జర్నలిస్టు సంఘాలు

న్యూఢిల్లీ: మీడియాపై మోదీ సర్కారు ఉక్కుపాదం మోపింది. వాస్తవాలు బయటికి రాకుండా చేయడానికి బెదిరింపులకు పాల్పడుతోంది. మీడియా సంస్థలు, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులపై కఠినచట్టాలు ప్రయోగిస్తోంది. ప్రతిపక్షాలు, జర్నలిస్టు సంఘాలు వ్యతిరేకిస్తున్నా...మోదీ సర్కారు మాత్రం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకొని అణచివేతకు పాల్పడుతోంది. దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని ప్రతిపక్షాలు సైతం మండిపడుతున్నాయి. తాజాగా చైనా నుంచి నిధులు అందుతున్నాయన్న ఆరోపణలపై ప్రముఖ ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై కేంద్రం కత్తికట్టింది. ఢిల్లీ పోలీసులను ప్రయోగించి దాడులు చేయించింది. ఈ దాడులను ప్రతిపక్ష 'ఇండియా' కూటమి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించాయి. న్యూస్‌క్లిక్ కార్యాలయం, ఆ మీడియా సంస్థలో పని చేసే జర్నలిస్టుల ఇళ్లలో ఢిల్లీ పోలీసులు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించారు. కాగా, ఈ కేసులో న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్ పోర్టల్ హెచ్‌ఆర్ అధినేత అమిత్ చక్రవర్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 37 మంది పురుషులు, 9 మంది మహిళలను ప్రశ్నించామని పోలీసు అధికారులు తెలిపారు. జర్నలిస్టుల నివాసాలపై ఉదయం 6 గంటలకు మొదలైన ఈ దాడులు రాత్రి వరకు కొనసాగాయి. న్యూస్ క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ, ఇతర జర్నలిస్టులు అభిసార్ శర్మ, ఊర్మిలేశ్ తదితరుల నివాసాల్లో తనిఖీలు జరిగాయి. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సిబ్బందిలో ఒకరైన శ్రీనారాయణ్ కుమారుడి సుమిత్ కుమార్ ఇంటిలోనూ సోదాలు జరిగాయి. సుమిత్ న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తున్నారు. కొంతమంది జర్నలిస్టులను విచారణ పేరుతో ఢిల్లీలోని ప్రత్యేక పోలీసుల కార్యాలయానికి తీసుకెళ్లారు. మరోవైపు పోలీసు చర్యను కేంద్ర సమాచార, ప్రసారశాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ సమర్థించగా ప్రతిపక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. న్యూస్‌క్లిక్ మీడియా సంస్థకు చైనా నుంచి నిధులు అందుతున్నాయనే ఆరోపణలతో ఢిల్లీ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్టోబర్ 2న ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ సీనియర్ అధికారుల సమావేశంలో ఈ కేసును ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై చర్చించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు స్థానిక న్యూస్‌క్లిక్ కార్యాలయంతో పాటు ఆ సంస్థలో పని చేసే సీనియర్ జర్నలిస్టుల ఇళ్లలో సోదాలు చేశారు. న్యూస్‌క్లిక్‌కు సంబంధించి ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, ముంబైలోని 100కు పైగా ప్రాంతాల్లో ఏకకాలంలో

- మిగతా 2 లో

ఢిల్లీ పోలీసుల ప్రతీకార దాడి దుర్మార్గం

సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం విమర్శ

న్యూఢిల్లీ: జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు, రచయితలు, హాస్య రచయితలపై ఢిల్లీ పోలీసుల ప్రతీకార చర్యలను సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినయ్ విశ్వం మంగళవారం తీవ్రంగా ఖండించారు. ఎలాంటి వారెంటు లేకుండా జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తల నివాసాలపై ఢిల్లీ పోలీసులు దాడులు చేసి...పుస్తకాలు, వార్తాపత్రికలు, ల్యాప్‌ట్యాప్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. జర్నలిస్టులు ఊర్మిలేశ్, ప్రరంజాయ్ గుహ, భాషా సింగ్, అభిసర్ శర్మ, ప్రబీర్ పుర్కాయస్థ, అనింద్యో చక్రవర్తి, చరిత్రకారుడు సొహైల్ హష్మీ, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్, కవి గీతా హరిహరన్, వ్యంగ్య రచయిత సంజయ్ రజౌర, శాస్త్రవేత్త డి.రఘునందన్ నివాసాలపై ఢిల్లీ పోలీసులు దాడులు చేసినట్లు తెలుస్తోందని, ఈ దాడులకు, సోదాలు కారణాలు మాత్రం పోలీసులు వెల్లడించ లేదని వినయ్ విశ్వం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ కోరుకున్న విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశంసలతో కొనియాడటానికి బదులు...దాని తప్పులను వారంతా ఎండగట్టడమే ఈ దాడులకు ప్రధాన కారణంగా భావించాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. మణిపూర్ సంక్షోభాన్ని ఎదుర్కోవడం, అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం, తప్పుడు వార్తల వ్యాప్తి, మతోన్మాదం, పెగాసెస్ వివాదం, రఫెల్ ఒప్పందంలో అవినీతి వంటి అనేక కీలక అంశాలపై మోదీ పాలనను జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారని వివరించారు. మణిపూర్ సంక్షోభం లేదా అదానీ ముడుపుల వ్యవహారం వంటి అంశాలపై పార్లమెంటులో సైతం చర్చించడానికి బీజేపీ ముందుకు రాకపోవడం బహిరంగ రహస్యమేనని వినయ్ విశ్వం తెలిపారు. దేశానికి సంబంధించిన అనేక కీలక అంశాలను పార్లమెంటులో చర్చకు

- మిగతా 2 లో

నిజాలు బయటపెడితే దాడులా?

న్యూస్‌క్లిక్ జర్నలిస్టులపై దాడికి 'ఇండియా' ఖండన

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ జర్నలిస్టులపై దాడులను ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు మంగళవారం తీవ్రంగా ఖండించాయి. నిజాలు మాట్లాడే వారిపై బీజేపీ ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుం దని విమర్శిం చాయి. మోదీ సర్కారు వాస్తవాలు బయటికి రాకుండా బెదిరింపులకు పాల్పడుతోందని మండిపడ్డాయి. విద్వేషాలు, విభజన రాజకీయాల వ్యాప్తిని బహిర్గతం చేయడాన్ని ఎంతమాత్రం సహించలేక పోతోందని తెలిపాయి. ఆశ్రిత పెట్టుబడిదారుల ద్వారా మీడియా సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి మోదీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేస్తోందని, బీజేపీ తప్పులు, విద్వేషాలు బటయపెట్టకుండా మీడియాపై ఉక్కుపాదం మోపుతోందని 'ఇండియా' ఓ ప్రకటనలో విమర్శించింది. దేశంలో ఏ మీడియా అయినా తమ గొంతుకగా ఉండాలని కోరుకుంటున్నదని తెలిపింది. 'వాస్తవాలు బయటపెడుతున్న జర్నలి స్టులపై అటు ప్రభుత్వమూ, దాని భావజాల సంస్థలు నిర్లజ్జగా దాడులకు పాల్పడుతున్నాయి. దర్యాప్తు సంస్థల ద్వారా బెదిరిస్తున్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్ 2021 వంటి తిరోగమన విధానాలను బీజేపీ వ్యాప్తి చేస్తోంది. బీజేపీ తన తప్పులను ప్రజలకు చేరకుండా చేయడం కోసం ఎంతకైనా తెగిస్తోంది. వాస్తవాలను దాచిపెడుతోంది' అని ప్రతిపక్ష కూటమి విమర్శిం చింది. వాస్తవాలు వెల్లడించే మీడియా, దాని జర్నలిస్టులపై బీజేపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని మండిపడింది. విద్వేషాలు, విభజనను ప్రోత్స హించే జర్నలిస్టులపై చర్యలు తీసుకోవడంలో బీజేపీ ప్రభుత్వం వెనుకాడుతోందని, ఇది అత్యంత దురదృష్టకర పరిణామమని ఆరోపించింది. దేశం, ప్రజల వాస్తవిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రభుత్వానికి హితవు పలికింది. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు

- మిగతా 2 లో

లోకేశ్‌పై సీఐడీ విచారణ 10కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సీఐడీ విచారణను అక్టోబరు 10కి వాయిదా వేయాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో లోకేశ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. సీఐడీ ఇచ్చిన 41ఏ నోటీసులోని నిబంధనలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లోకేశ్ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. లోకేశ్ తరపున పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. హెరిటేజ్ సంస్థలో లోకేశ్ భాగస్వామి అని, ఆయనకు తీర్మానాలు ఇవ్వాలన్నా, బ్యాంకు ఖాతా పుస్తకాలు ఇవ్వాలన్నా కంపెనీ ప్రొసీజర్ ఉంటుందని కోర్టుకు వివరించారు. లోకేశ్‌ను ఇవి అడగడం సమంజసం కాదని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. తాము డాక్యుమెంట్లపై ఒత్తిడి చేయబోమని, బుధవారమే విచారణకు హాజరు కావాలని సీఐడీ తరపు న్యాయవాదులు కోరారు. దీనిపై స్పందించిన పోసాని అంత తొందరేముందని ప్రశ్నించారు. రెండువర్గాల

- మిగతా 2 లో

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ 9కి వాయిదా

సెక్షన్ 17ఏ వర్తింపుపై సుప్రీంలో వాడివేడి వాదనలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంటు కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మంగళవారం వాడివేడిగా వాదనలు సాగాయి. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అంతకుముందు చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. తొలుత హరీశ్ స్వాలే వాదనలు వినిపిస్తూ రాజకీయ ప్రతీకారం కోసమే సెక్షన్ 17ఏ తీసుకొచ్చారని, ఈ కేసులో ఆ సెక్షన్ వర్తిస్తుందా? లేదా? అన్నదే ప్రధానమన్నారు. ఆరోపణలు ఎప్పటివనేది కాదని, కేసు నమోదు, విచారణ ఎప్పుడన్నదే చర్చించాల్సిన అంశమని చెప్పారు. అనంతరం అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ అవినీతి నిరోధక చట్ట సవరణలో ప్రతి పదం సునిశితంగా పరిశీలించి నిర్ధారించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 'కేబినెట్ నిర్ణయాలకు సీఎం ఒక్కరే బాధ్యులు కాలేరు. ఆ నిర్ణయాలు అధికార నిర్వహణలో భాగం. అధికార నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలపై ప్రతీకార చర్యల నుంచి 17ఏ రక్షణ కల్పిస్తుంది. యశ్వంత్ సిన్హా కేసులో

- మిగతా 2 లో

అంగళ్ల కేసులో జోక్యానికి సుప్రీం నిరాకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగళ్లు కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఘటనలో టీడీపీ నాయకులకు హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఆరు వేర్వేరు పిటిషన్లను జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో టీడీపీ నేతలకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరిట ఆగస్టు 4న అన్నమయ్య జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటించారు. అంగళ్లు మీదుగా ఆయన వెళుతున్నప్పుడు వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో చంద్రబాబు సహా ఆ పార్టీకి చెందిన మొత్తం 179 మంది నేతలపై కురబలకోట మండలం ముదివేడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో అనేకమంది టీడీపీ నేతలను అరెస్ట్ చేశారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం

- మిగతా 2 లో

మహా మృత్యు ఘోష

- నాందేడ్ ఆస్పత్రిలో మరో ఏడుగురి రోగుల మృతి
- రెండు రోజుల్లో 31కి చేరాయన్న అధికారులు

8 లో

ఇదీ లోకం!

అప్పుల్లో ఉండి లబోదిబోమంటున్నాం గానీ..లేదంటే మా నాయకుడు బోలెడన్ని జైళ్లు కట్టించేవాడు తెలుసా!

డ్రాపౌట్స్ తగ్గేనా?

- గణాంకాల వెల్లడిలో మౌనం
- బడి ఈడు పిల్లలు బయటే
- పది తప్పిన వారికీ చోటు
- గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికం
- నివారణ చర్యల్లో విద్యాశాఖ జాప్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో విద్యారంగ బలోపేతంపై అనేక సంస్కరణలు చేస్తున్నామంటూ ఆర్భాటంగా చేస్తున్న జగన్ సర్కార్ ప్రచారానికీ, ఆచరణలో అవి అమ లుకూ పొంతన లేకుండా పోతోంది. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ లెక్కలు తేల్చడంలో విద్యాశాఖ మౌనం వహిస్తోంది. నెలరోజుల్లోగా పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్ ఒకటి సైతం ఉంటే తాను రాజీనామా చేస్తానంటూ విద్యాశాఖలోని ఓ ఉన్నతాధికారి చేసిన ప్రకటన ఇప్పుడు ప్రస్తావనకు వస్తోంది. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలు డ్రాపౌట్స్ అవుతున్నారా?, లేదా? అనేది విద్యాశాఖ తేల్చాల్సి ఉంది. అదే దిశగా ప్రభుత్వమూ ఆరా తీయాలి. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడంలో విద్యాశాఖ పూర్తిగా కృషి చేయడం లేదనే విమర్శలున్నాయి. బడికి పోకుండా ఉండే వారిలో గ్రామీణ ప్రాంతాల్లో

- మిగతా 2 లో

మోదీ, జగన్‌ను సాగనంపితేనే రైతుకు రక్షణ

- ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపు
- కార్పొరేట్లకు మోదీ దాసోహం: ఓబులేసు
- హోంశాఖ సహాయమంత్రిని బర్తరఫ్ చేయాలి: వడ్డే
- హంతకులను శిక్షించకపోవడం దుర్మార్గం: రామచంద్రయ్య
- ప్రధాని హామీ అమలుకాకపోవడం సిగ్గుచేటు: కేవీవీపీ
- రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డే విజయవంతం

2 లో

107 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై విద్వేష కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. బాధ్యతాయుత రాజకీయ నాయకులే విద్వేషం పెంచిపోషిస్తున్నారు. అందులో కొంతమంది పైనే కేసులు నమోదవుతున్నాయి. ఇలా కేసులు నమోదు కాని నాయకులు ఎంతోమంది ఉన్నారు. తాజాగా విద్వేష ప్రసంగాలు చేసిన ప్రజాప్రతినిధుల జాబితాను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. మొత్తం 107 మంది ఎంపీ, ఎమ్మెల్యేలపై విద్వేష ప్రసంగాల కేసులు నమోదయ్యా యని తెలిపింది. 107 మంది ఎంపీ, ఎమ్మెల్యేలు,

- మిగతా 2 లో



భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోం: భౌతిక శాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి ముగ్గురిని వరించింది. ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాల్లో భాగంగా ఈ అవార్డును రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అమెరికాకు చెందిన పెర్రీ అగోస్తిని, జర్మనీకి చెందిన ఫెరెన్స్ క్రౌజ్, స్వీడన్‌కు చెందిన అన్నె ఎల్ హ్యులియర్‌కు ఈ ఏడాది నోబెల్ ప్రకటించారు. అణువుల్లో ఎలక్ట్రాన్ డైనమిక్స్‌ను అధ్యయనం చేసేందుకు... కాంతి తరంగాల ఆటోసెకండ్ పల్స్‌ను ఉత్పత్తి చేసే పరిశోధనలకుగాను వీరికి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ వెల్లడించింది. వీరి పరిశోధనలతో అణువులు, పరమాణువుల్లోని ఎలక్ట్రాన్స్‌ను అధ్యయనం చేసేందుకు మానవాళికి కొత్త సాధనాలు అందాయని పేర్కొంది. ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారం మొదలయింది. వైద్య శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిపై పోరు కోసం సమర్థ ఎంఆర్ఎన్ఏ టీకాల అభివృద్ధికి మార్గం సుగమం చేసిన శాస్త్రవేత్తలు కాటలిన్ కరికో, డ్రూ వెయిస్‌మన్‌కు ఈ అవార్డు వరించింది. బుధవారం కెమిస్ట్రీ బహుమతి, గురువారం సాహిత్య బహుమతితో నోబెల్ ప్రకటనలు కొనసాగుతాయి. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని, అక్టోబరు 9న ఆర్థిక శాస్త్ర పురస్కారాన్ని ప్రకటించనున్నారు. నోబెల్ వర్ధంతి అయిన డిసెంబరు 10న జరిగే వేడుకల్లో ఈ అవార్డును గ్రహీతలకు అందజేస్తారు. పరమాణువులు, అణువుల్లో ఎలక్ట్రాన్ల కదలికలు చాలా వేగంగా ఉంటాయని, వాటిని ఆటోసెకండ్స్‌లో కొలుస్తారు. ఆటోసెకండ్ అంటే ఒక సెకను అని, అది ఈ విశ్వం వయసుకు ఓ సెకండ్‌తో సమానమని పేర్కొన్నారు. ఆటోసెకండ్ లైటు ద్వారా ఎలక్ట్రాన్ల కదలికలను అధ్యయనం చేయవచ్చు. ఈ సాంకేతికత క్రమేణా అభివృద్ధి చెందుతున్నట్లు అకాడమీ తన ప్రకటనలో తెలిపింది. పరమాణువుల్లో ఎలక్ట్రాన్ల లోకాన్ని పరిచయం చేసిన శాస్త్రవేత్తలకు ఈ యేటి నోబెల్ భౌతిక శాస్త్రం అవార్డు దక్కుతుందని కమిటీ వెల్లడించింది.

విచారణ 9కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు తీర్పు ఈ కేసుకు కచ్చితంగా వర్తించి తీరుతుంది. ట్రాప్ కేసు తప్ప మిగిలిన 6 రకాల ఆరోపణలకు 17ఏ వర్తిస్తుంది. 2015 నుంచి 2019 వరకు జరిగిన పరిణామాలపై ఆరోపణలు ఉన్నాయి. చట్ట సవరణ తర్వాత మరో ఏడాది కాల వ్యవధిని ఈ కేసులో చేర్చారని అభిషేక్ సింఘ్వీ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత సీఐడీ తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2018 జులైలో చట్ట సవరణ వచ్చిందని, 2021లో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ 2017లోనే కేసు మూలాలు ఉన్నందున 17ఏ వర్తించదన్నారు. కేసు విచారణ ముందే జరిగిందనడానికి ఆధారాలు, పత్రాలు ఏమైనా ఉన్నాయా అని జస్టిస్ అనిరుద్ధ బోస్ ప్రశ్నించారు. దీనిపై రోహత్గీ స్పందిస్తూ 10 శాతం ప్రభుత్వ సంస్థ, 90 శాతం ప్రవేటు సంస్థ పేరుతో జరిగిన ఒప్పందంలో వందల కోట్ల దుర్వినియోగం జరిగిందన్నారు. పిటిషనర్ కౌంటర్ కూడా వేయలేదని కోర్టుకు తెలిపారు. ఈ దశలో చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కలుగజేసుకుని కోర్టుకు అన్ని ఆధారాలు సమర్పించామని చెప్పారు. డాక్యుమెంట్లు సమర్పించేందుకు సమయం కావాలని రోహత్గీ కోరారు. మొత్తం కేసు వివరాలతో తాము సిద్ధంగా ఉన్నామని లూథ్రా తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.

చంద్రబాబు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఏపీ హైకోర్టు రిజర్వ్ చేసింది. విచారణ సందర్భంగా చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. ఆ తర్వాత సీఐడీ తరపున ఏజీ శ్రీరామ్ వాదనలు కొనసాగించారు. ఏజీ వాదనలకు లూథ్రా కౌంటరు వాదనలు వినిపిస్తూ కేవలం రాజకీయ దురుద్దేశంతోనే సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగించిన ఉన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

లోకేశ్‌పై సీఐడీ విచారణ 10కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

వాదనలు విన్న ధర్మాసనం అక్టోబరు 10న సీఐడీ విచారణకు లోకేశ్ హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. అమరావతి రింగ్‌రోడ్డు కేసులో ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని లోకేశ్‌కు సీఐడీ అధికారులు నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే.

ఫైబర్ గ్రిడ్ కేసులోనూ ఊరట

ఫైబర్ గ్రిడ్ కేసులోనూ లోకేశ్‌కు ఊరట లభించింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని లోకేశ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ పూర్తి చేసింది. లోకేశ్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన తమకుందని ఆయన తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అయితే లోకేశ్‌ను ఇంతవరకూ ఫైబర్ గ్రిడ్ కేసులో నిందితుడిగా చేర్చలేదని ప్రభుత్వ న్యాయవాది స్పష్టం చేశారు. ఒకవేళ చేరిస్తే ఆయనకు సీఆర్‌పీసీలోని 41 ఏ కింద నోటీసులు ఇస్తామని చెప్పారు. 41 ఏ నిబంధనలు పాటించకపోతే కోర్టుకు విన్నవిస్తామని లోకేశ్ తరపు న్యాయవాది చెప్పారు.

విద్వేష కేసులు: ఏడీఆర్

(మొదటిపేజీ తరువాయి)

గత ఐదేళ్లలో ఎన్నికల్లో పోటీ చేసిన 480 మంది అభ్యర్థులపై ఈ కేసులు నమోదయ్యాయి. ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థులు పొందుపర్చిన వివరాల ఆధారంగా ఈ గణాంకాలు వెల్లడించినట్లు ఏడీఆర్ నివేదిక తెలిపింది. తమపై విద్వేష ప్రసంగాలు ఉన్నట్లు ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ అఫిడవిట్లలో పేర్కొన్నట్లు నివేదిక చెప్పింది. మొత్తం 33 మంది ఎంపీలపై విద్వేష ప్రసంగాల కేసులు నమోదయ్యాయి. అందులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తమిళనాడుకు చెందిన నలుగురు, బీహార్, కర్నాటక, తెలంగాణకు చెందిన ముగ్గురు చొప్పున, అసోం, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇద్దరేసి చొప్పున, జార్ఖండ్, మధ్యప్రదేశ్, కేరళ, ఒడిశా, పంజాబ్‌కు చెందిన ఒక్కొక్కరు ఉన్నట్లు వివరించింది. గడచిన ఐదేళ్లలో లోక్‌సభ, అసెంబ్లీలకు పోటీ చేసిన అభ్యర్థుల్లో 480 మందిపై విద్వేష ప్రసంగాల కేసులు ఉన్నాయని పేర్కొంది. ఇందులో అధికార బీజేపీకి చెందిన ఎంపీలే 22 మంది ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ఆప్, ఏఐఎంఐఎం, ఏఐయూడీఎఫ్, డీఎంకే, ఎండీఎంకే, పీఎంకే, శివసేన (ఉద్ధవ్), వీసీకే నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. ఒక ఇండిపెండెంట్ ఎంపీపైనా ఇదే తరహా కేసు నమోదైనట్లు తెలిపింది. ఇక ఎమ్మెల్యే విషయానికి వస్తే... మొత్తం 74 మంది ఎమ్మెల్యేలపై విద్వేష ప్రసంగాల కేసులు నమోదయ్యాయి. బీహారు, ఉత్తరప్రదేశ్ నుంచి 9 మంది చొప్పున, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి ఆరుగురు వంతున, అసోంలో నాలుగు, తమిళనాడులో నాలుగు, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లో నలుగురు చొప్పున, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌లలో ముగ్గురు చొప్పున, కర్నాటక, పంజాబ్, రాజస్తాన్, త్రిపురలో ఇద్దరు చొప్పున, మధ్యప్రదేశ్, ఒడిశాలో ఒక్కొక్కరిపై ఈ కేసులు నమోదయ్యాయి. ఇందులో బీజేపీ నుంచి 22 మంది, కాంగ్రెస్ నుంచి 13 మంది, ఆప్ నుంచి ఆరుగురు, ఎస్‌పీ, వైసీపీ నుంచి ఐదుగురు చొప్పున, డీఎంకే, ఆర్‌జేడీ నుంచి నలుగురు వంతున, తృణమూల్, ఎస్‌హెచ్‌ఎస్ నుంచి ముగ్గురు చొప్పున, ఏఐయూడీఎఫ్ నుంచి ఇద్దరు, ఎంఐఎం, సీపీఎం, ఎన్‌సీపీ, సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్‌పార్టీ, టీడీపీ, తిప్రా మోతా పార్టీ, టీఆర్ఎస్ నుంచి ఒక్కొక్కరు, ఇద్దరు ఇండిపెండెంట్లపై ఈ కేసులు నమోదయ్యాయి.

పాక్‌లో కిడ్నీ రాకెట్ గుట్టు రట్టు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నంకావడంతో దొడ్డిదారిలో సంపాదన కోసం ఆ దేశ ప్రజలు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మానవ అవయవాల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఒక ముఠా గుట్టును పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్ పోలీసులు రట్టు చేశారు. ఒక బాధితుడు తమవద్దకు వచ్చి కొందరు తనను బలవంతంగా ప్రైవేట్ ట్రీట్మెంట్ చేయించుకోమని వేధించారని ఫిర్యాదు చేయడంతో డొంక మొత్తం కదిలింది. అంతగా పేరులేని ఒక డాక్టర్ గుట్టుగా నిర్వహిస్తున్న మానవ అవయవాల స్మగ్లింగ్ గుట్టును పోలీసులు రట్టు చేశారు ధనికుల అవసరానికి తగ్గట్టుగా కిడ్నీలను సమకూర్చే క్రమంలో ఈ ముఠా వందల మందికి సర్జరీలు నిర్వహించి వారి కిడ్నీలను తొలగించింది. డాక్టర్ ఫవాద్ నేతృత్వంలో సాగుతున్న ఈ దందా గురించిన వివరాలు అక్కడి ముఖ్యమంత్రి మొహ్‌సిన్ నఖ్వీ బయటపెట్టారు. డాక్టర్ ఫవాద్ ఇప్పటివరకు మొత్తం 328 సర్జరీలు నిర్వహించారని వీటి

ద్వారా సుమారు 35000 డాలర్లు (రూ.28.27 లక్షలు) కొల్లగొట్టారని నఖ్వీ చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశామని చెప్పారు. వీరిలో ఒక కారు మెకానిక్ బాధితులకు అనస్థీషియా ఇవ్వడంలో సహకరించేవాడని తెలిపారు. ఆసుపత్రుల్లో చేరిన పేషేంట్లను లాహోర్ లేదా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అక్కడ గుట్టుగా ఆపరేషన్లు నిర్వహించేవారని తెలిపారు. ముఖ్యంగా పాక్ ఆక్రమిత కశ్మీర్లో కిడ్నీ మార్పిడులకు సంబంధించి ఎలాంటి చట్టాలు లేనందున అక్కడ వీరు యథేచ్ఛగా సర్జరీలు చేసేవారన్నారు. ఈ ముఠా నిర్వహించిన సర్జరీల్లో ఇప్పటివరకు ముగ్గురు మృతిచెందారని గుర్తించామని, మిగిలిన విషయాలపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. నిందితుడు డాక్టర్ ఫవాద్ ఇదే కేసులో గతంలో ఐదు సార్లు అరెస్టయ్యారని కానీ న్యాయపరమైన లొసుగులను అడ్డంపెట్టుకుని బయటకు వచ్చేవారని తెలిపారు. ఆశ్చర్యకరంగా సర్జరీలు జరిగిన చాలామందికి తమ కిడ్నీని తొలగించిన విషయం కూడా తెలియదన్నారు. ఈ ముఠాసభ్యుల్లో ఒకరు తనవద్దకు వచ్చి ప్రైవేటు ట్రీట్మెంట్ కోసం బలవంత పెట్టారని ఇప్పుడు వేరొక డాక్టర్ వద్దకు వెళ్తే తనకు ఒక కిడ్నీలేదని చెప్పారని ఒక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

దౌత్య సిబ్బందిని తగ్గించండి

కెనడాకు భారత్ మరోసారి అల్టిమేటం

ఒట్టావా: కెనడా-భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. న్యూఢిల్లీలో ఉన్న కెనడా దౌత్య సిబ్బందిని తగ్గించుకోవాలని కెనడాకు భారత్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. సిబ్బందిని తగ్గించుకునేందుకు ఈ నెల 10వ తేదీ తుది గడువును కూడా విధించినట్లు తెలుస్తోంది. ఉభయ దేశాల్లో సమాన దౌత్య అధికారులు ఉండాలనే నియమంపై భారత్ ఇప్పటికే అనేక సార్లు కెనడాను కోరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఢిల్లీలో 62 మంది కెనడా దౌత్య అధికారులు ఉంటుండగా ఆ సంఖ్యను 41కి తగ్గించుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 10 తర్వాత ఇంకా ఎక్కువ మంది దౌత్య అధికారులు ఉంటే వారికి రక్షణను రద్దు చేస్తామని కూడా కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఈ వార్తలపై అటు భారత ప్రభుత్వంగానీ, విదేశాంగ శాఖ గానీ అధికారికంగా స్పందించలేదు. ప్రస్తుతం కెనడా-భారత్ మధ్య వివాదాస్పద వాతావరణం నెలకొంది. ఖాలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించడం వివాదానికి కారణమైంది. ఈ కేసు దర్యాప్తులో సహకరించాలని భారత్‌ను కెనడా డిమాండ్ చేసింది. ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేశారని భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెండు దేశాలు ఆంక్షలు విధించుకున్నాయి.

మోదీ, జగన్‌ను సాగనంపితేనే రైతుకు రక్షణ

ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో నలుగురు రైతుల మృతికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలని రైతు, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దీనిపై రెండేళ్లుగా డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై 'సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ 'డే' నిర్వహించారు. రైతులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. దీనిలో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్ నుండి ధర్నాచౌక్ వరకు నల్లబ్యాడ్జీలు, నల్లజెండాలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో అఖిలభారత కిసాన్‌సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సూచించిన సిఫార్సుల ప్రకారం ప్లస్ 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఒక క్వింటా ధాన్యానికి రూ.750 అదనంగా కేరళ ప్రభుత్వం బోనస్ ఇస్తుందని, తమిళనాడు ప్రభుత్వం రూ.150 చెల్లిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం గానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గానీ అదనంగా ఒక్క రూపాయి చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే ఈ రెండు ప్రభుత్వాలు దేశానికి అన్నం పెట్టే రైతులకు సున్నం కొడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యల నివారణకి కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని, ఒక పర్యాయం రైతులకు సంబంధించిన అన్ని రకాల పంట రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా రైతులు మరోసారి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో రైతుల రక్షణ కోసం మోదీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపాల్సిన అవసరం ఉందని రావుల వెంకయ్య స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా లఖింపూర్‌ఖేరీ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామని లిఖితపూర్వక హామీ ఇచ్చి...దానిని అమలు చేయలేదని విమర్శించారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు కోసం జరిగిన ఉద్యమంలో 75 వేల మందిపై కేసులు బనాయించారని, ఈ కేసులు ఎత్తివేస్తామని చెప్పినప్పటికీ అమలు చేయలేదని నిందించారు. రైతుల మరణానికి కారణమైన అజయ్ మిశ్రాను, అతని కుమారుడు, అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం చేసే విధానాలు అనుసరించడంతోపాటు కార్మికుల సంక్షేమాన్ని నాశనం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి కార్మికులన్నా, రైతులన్నా ఇష్టం లేదని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నదని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయవద్దని ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, సుబ్బరావమ్మ మాట్లాడుతూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడమే కార్మికుల, కర్షకుల కర్తవ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు ముందుగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన డాక్టర్ స్వామినాథన్, ప్రముఖ ఇరిగేషన్ ఇంజినీర్ చెరుకూరి వీరయ్యచౌదరి, ప్రముఖ రైతు నాయకులు యెర్నేని నాగేంద్రనాథ్‌లకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సభ నివాళులర్పించింది. రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు డి.హరినాథ్, డాక్టర్ కొల్లా రాజమోహన్, వి.కృష్ణయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, వెలగపూడి అజాద్, ముక్కామల ఉమామహేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు జాస్తి కిషోర్ బాబు, కె బసవయ్య, శ్రీధర్, సాంబశివరావు, వెంకట సుబ్బయ్య, ఆర్‌వీ నరసింహారావు, రమాదేవి,ఏవీఆర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలు ప్రతిఘటించండి: రామచంద్రయ్య

పత్తికొండ: మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ కూడలిలో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ లఖింపూర్‌ఖేరీలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రా రైతులను కార్లతో తొక్కించి చంపేశాడని, అయినా నిందితుడిని మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు శిక్షించకపోవడం దుర్మార్గమన్నారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు నెట్టి కంటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, కార్మిక, రైతు సంఘాల నాయకులు రంగన్న, మాదన్న, రాజప్ప, కాశీ విశ్వనాథ్, వెంకటేశ్వరరెడ్డి, దస్తగిరి, లక్ష్మన్న, ఈరన్న, సిద్ధయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని హామీ అమలుకాకపోవడం సిగ్గుచేటు: కేవీవీపీ

రైతుల మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తామన్న మోదీ హామీ రెండేళ్లుగా అమలుకు నోచుకోకపోవడం సిగ్గు చేటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. బ్లాక్‌డేలో భాగంగా స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద అమరులైన రైతు నేతలకు, జర్నలిస్టుకు ఘన నివాళి అర్పించారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు చుంచు శేషయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు కాలం సుబ్బారావు అధ్యక్షవర్గంగా జరిగిన కార్యక్రమంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. రైతు హంతకులను మోదీ ప్రభుత్వం నిస్సిగ్గుగా కాపాడుతోందని విమర్శించారు. అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు కాలం సుబ్బారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జామాయిల్-సుబాబుల్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

దాడులు కొనసాగాయి. ఈ సోదాల్లో భారీ ఎత్తున సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నివేదికల ప్రకారం దాడి చేయబోయే వ్యక్తుల పేర్ల జాబితాను తయారు చేసి, వారిని మూడు (ఏ,బీ,సీ) కేటగిరీలుగా విభజించారు. 'ఏ' కేటగిరీలో చేర్చిన జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్నారు. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థను విచారణ కోసం ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ దాడిలో ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్‌లోని అన్ని రేంజ్‌ల బృందాలు రంగంలోకి దిగాయి. దాదాపు 500 మంది పోలీసులు దాడిలో పాల్గొన్నారు. కాగా న్యూస్‌క్లిక్ సంస్థపై కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యూఏపీఏ) కింద ఆగస్టు 17న కేసు నమోదైంది. ఆ కేసు ఆధారంగా ఢిల్లీలోని 100కి పైగా చోట్ల, నోయిడా, ఘజియాబాద్‌లోని పొరుగు ప్రాంతాలలో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం దాడులు నిర్వహించింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై ఇప్పటికే న్యూస్‌క్లిక్‌పై ఈడీ దర్యాప్తు చేసింది. అయితే, న్యూస్‌క్లిక్, దాని ఎడిటర్-ఇన్-చీఫ్‌పై కఠినచర్యలు తీసుకోవద్దని 2021లో ఢిల్లీ హైకోర్టు ఈడీని ఆదేశించింది. ఇదే అంశం పార్లమెంటు వర్షాకాల సమావేశాలను కుదిపేసింది. పాలక బీజేపీపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. తనపై వచ్చిన ఆరోపణలను న్యూస్‌క్లిక్ నిర్ద్వంద్వంగా ఖండించింది.

కాగా, న్యూస్ క్లిక్‌కు చైనా నుంచి సుమారు రూ.38 కోట్లు అందినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ భావిస్తున్నది. 8 మంది జర్నలిస్టులకు ఆ మొత్తాన్ని జీతాల రూపంలో ఇచ్చినట్లు ఆరోపించింది. ఆ జర్నలిస్టులను ఈడీ విచారించింది. మానవ హక్కుల నేత తీస్తా సెతల్వాద్ కూడా న్యూస్‌క్లిక్ సంస్థతో లావాదేవీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖాకు ఆమె లీగల్ ఖర్చులు భరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బీమా కోరేగావ్ కేసులో గౌతమ్‌పై ఆరోపణలు ఉన్నాయి. పది మంది జర్నలిస్టులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అందులో ఐదుగురిని ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్‌కు తీసుకువచ్చారు. వారి వద్ద వాంగ్మూలం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఎవర్నీ అరెస్టు చేయలేదు. యూఏపీఏలో ఉన్న ఐదు సెక్షన్ల కింద న్యూస్ క్లిక్ సంస్థపై కేసు నమోదు చేశారు. దీంతో పాటు ఇండియన్ పీనల్ కోడ్‌లోని మరో రెండు సెక్షన్లను జోడించారు. ఐపీసీలోని 153ఏ(రెండు మతాలు, గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), 120బీ (నేరారోపణ కుట్ర) కింద కేసులు పెట్టారు. ఇక యూఏపీఏలో సెక్షన్ 13(ఉగ్రవాద చట్టం కింద శిక్ష), సెక్షన్ 16(టెర్రరిస్టు యాక్టు), సెక్షన్ 17(ఉగ్ర చర్యల కోసం నిధులు సమీకరించడం), సెక్షన్ 18(కుట్ర), సెక్షన్ 22సీ(కంపెనీ నేరాలు) కింద కేసు నమోదు చేశారు. గత ఆగస్టులో న్యూస్‌క్లిక్‌కు చైనా నుంచి నిధులు అందుతున్నాయని అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ వంటి పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఈ క్రమంలోనే న్యూస్‌క్లిక్‌పై ఈడీ కేసు నమోదు చేసింది.

డ్రాపౌట్స్ తగ్గేనా?

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ఒకటి నుంచి ఏడు తరగతులకు చెందిన బడి ఈడు పిల్లలు ఉన్నట్లు, అందులోనూ బాలికలే అధికంగా ఉన్నట్లు సమాచారం. తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల రీత్యా వారి పనులకు వెళ్లడంతో ఇంట్లోనే బాలికలను ఉంచి బడికి పంపడం లేదని తెలుస్తోంది. ఆ దిశగా వారి సమాచారం సేకరించి, తల్లిదండ్రులను చైతన్యవంతం చేసి బడికి పంపించాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉంది. పదో తరగతి తప్పిన విద్యార్థుల ఇళ్లకు ప్రధానోపాధ్యాయులను పంపి, వారికి వారి అమ్మఒడి ఇప్పిస్తామని మళ్లీ వారితో ఫీజు కట్టించి, ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి చేర్పిస్తున్నారు. వారికి దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ఇలా పదో తరగతి తప్పిన వారిని సైతం గణాంకాల్లో చూపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితమేదీ?

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ బలోపేతం కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ డ్రాపౌట్స్‌ను నివారించలేకపోయిందనే విమర్శలున్నాయి. 'మనబడి', 'నాడు-నేడు' ద్వారా పాఠశాలల స్వరూపాన్ని జగన్ సర్కార్ పూర్తిగా మార్చేసింది. జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో ప్రతి ఏటా రూ.13 వేలు వేస్తోంది. అంతటితో ఆగకుండా మధ్యాహ్నం భోజనంలో మార్పులు తీసుకొచ్చింది. జగనన్న గోరుముద్ద పేరిట రుచికరమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు వండిస్తోంది. విద్యార్థుల ఏకరూప దుస్తులు, బూట్లను పంపిణీ చేస్తూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉండే వాతావరణాన్ని తీర్చిదిద్దుతోంది. ఎనిమిదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి, అందులో నేటి పోటీ తత్వానికి అనుగుణంగా బైజూస్ కంటెంట్‌ను సమకూర్చుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి, కేంద్రంలోని సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా విద్యాబోధన కొనసాగిస్తోంది. ఇంతగా సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యార్థుల డ్రాపౌట్స్ పై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం దురదృష్టకరం. అన్ని జిల్లాల్లోనూ డ్రాపౌట్స్ సమస్య ఉన్నట్లు సమాచారం. వాటి గణాంకాలను విద్యాశాఖ యంత్రాంగం దాచిపెడుతోందననే విమర్శలున్నాయి. తాజాగా నెల్లూరు పట్టణంలోనే ఐదు వేల వరకు డ్రాపౌట్స్ విద్యార్థులు ఉన్నట్లు ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ, విద్యాశాఖలో స్పందన లేదు. దానిని అన్వయించి అన్ని జిల్లాల్లోనూ బడి ఈడు విద్యార్థుల డ్రాపౌట్స్ గణాంకాలను తేల్చడంలో సాచివేత ధోరణితో ఉన్నారు. దీంతో చాలామంది గ్రామీణ ప్రాంత బడి ఈడు పిల్లలు బయటే తిరుగుతూ, విద్యకు దూరమవుతున్నారు.

అధికారి రాజీనామా చేస్తారా?

నిత్యం పాఠశాలలను తనిఖీ చేసి, ఉపాధ్యాయులపై వివిధ రూపాల్లో చర్యలు తీసుకునే ఆ ఉన్నత స్థాయి అధికారి సైతం డ్రాపౌట్స్‌పై మౌనంగా ఉన్నారనే విమర్శలున్నాయి. రాష్ట్రంలో నెల రోజుల్లోగా ఎక్కడా డ్రాపౌట్స్ లేకుండా చూస్తానని, లేకుంటే తాను రాజీనామా చేస్తానని సదరు అధికారి గతంలో ఒక ప్రకటన చేసిన విషయం విదితమే.

అధికారి చెప్పిన విధంగా అన్ని జిల్లాల్లోనూ ఎక్కడా డ్రాపౌట్స్ లేదనే వాస్తవ గణాంకాలను వెల్లడించి, తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాల్సిన అవసరం ఉంది. డ్రాపౌట్స్ ఉన్నట్లు గణాంకాల్లో తేలితే, తన సవాల్‌కు అనుగుణంగా పదవికి రాజీనామా చేయాలి. సీఎం జగన్ ప్రభుత్వం నుంచి ప్రశంసలు పొందాలనే తపనతో నిత్యం పాఠశాలలకు సదరు అధికారి వెళ్లి హడావిడీ చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇప్పటికైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ అధికారులు సంప్రదింపులు చేపట్టి, డ్రాపౌట్స్ శాశ్వత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే బడి ఈడు పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. సీఎం జగన్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంకా బడి ఈడు పిల్లలు ఎవరైతే బయట ఉన్నారనే దానిపై దృష్టి పెట్టాలి. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఒక ప్రత్యేక సర్వే చేయించి డ్రాపౌట్స్ తగ్గింపునకు వేగవంతమైన చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

అంగళ్ల కేసులో జోక్యానికి సుప్రీం నిరాకరణ

(మొదటిపేజీ తరువాయి)

కొందరికి బెయిల్ లభించింది. హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆరు వేర్వేరు పిటిషన్లను దాఖలు చేసింది. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై ధర్మాసనం అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై అభ్యంతరం తెలిపింది. పోలీసు అధికారులు గాయపడ్డారనీ, ఒక కానిస్టేబుల్ ఫిర్యాదుదారుగా ఉన్నారని ఏపీ ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. ఇందుకు స్పందించిన ధర్మాసనం భద్రత కల్పించే పోలీసులే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారే సాక్షులుగా ఉంటారా? అని ప్రశ్నించింది. హైకోర్టు బెయిల్ ఇచ్చినందున దీనిలో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది.

నిజాలు బయటపెడితే దాడులా?

(మొదటిపేజీ తరువాయి)

మీడియాపై దాడులను ఆపాలని డిమాండ్ చేసింది. చైనా అనుకూల ప్రచారం కోసం నిధులు స్వీకరించారన్న ఆరోపణలపై న్యూస్‌క్లిక్, దాని జర్నలిస్టులపై కేసు నమోదైంది. తీవ్రవాద వ్యతిరేక చట్టం ఉపా కింద ఈ కేసు నమోదు చేశారు. అందులో భాగంగా ఢిల్లీ ప్రత్యేక పోలీసుల విభాగం న్యూస్‌క్లిక్, దాని జర్నలిస్టులకు సంబంధించిన 30 ప్రాంతాలపై దాడులు చేసింది. విచారణ పేరుతో ఊర్మిలేశ్, అభిసార్ శర్మ సహా కొంతమంది జర్నలిస్టులను లోధి రోడ్డులోని ప్రత్యేక కార్యాలయానికి తరలించారు. వారిపై 25 ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మీడియాపై ప్రభుత్వం జరిపిన తాజా దాడిని ఇండియా పార్టీలు తీవ్రంగా ఖండించాయి. మీడియాకు అండగా ఉంటాయని, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణకు మద్దతుగా నిలుస్తామని స్పష్టమైన హామీ ఇచ్చాయి. గడచిన పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మీడియా అణచివేతకు దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా వాడుకుంటున్నదని విమర్శించాయి.

ఢిల్లీ పోలీసుల ప్రతీకార దాడి దుర్మార్గం

(మొదటిపేజీ తరువాయి)

రాకుండా అధికారపక్షం అడ్డుకోవడం, పదేపదే సభా కార్యకలాపాలకు ఆటంకం కలగడం అందరూ చూస్తున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం జర్నలిస్టుల నివాసాలపై జరిగిన దాడులను చూడాల్సి ఉందని వ్యాఖ్యానించారు. మోదీ సర్కారు హయాంలో పత్రికా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ ఆందోళనకరంగా మారిందని ఆయన విమర్శించారు. విమర్శలను తట్టుకోలేకపోవడం, సమాచారం ప్రజల వద్దకు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. ఈ ఆందోళనకర పరిణామాలపై సీపీఐ పార్లమెంటరీ నాయకుడు వినయ్ విశ్వం స్పందిస్తూ పత్రికాస్వేచ్ఛపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని విమర్శించారు. ప్రపంచ పత్రికారంగ సూచీలో భారత్ కింది నుంచి 20వ స్థానంలో నిలవడం దీనిని సూచిస్తోందని తెలిపారు. వాస్తవాలు బహిర్గతం చేసినందుకుగాను ఆటవిక చట్టాలు ప్రయోగించి ఇప్పటికే అనేకమంది జర్నలిస్టులను జైళ్లకు పంపిందని మోదీ సర్కారును నిందించారు. ప్రజాస్వామ్య సమాజంపై బీజేపీ ధికార్క స్వరం వినిపిస్తోందని ఆరోపించారు. దుష్టపాలన, అవినీతి, 9 ఏళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే మోదీ సర్కారు ఇలాంటి దాడులకు తెగబడుతోందని విమర్శించారు.

టీడీపీ చీలిక ఖాయం

విజయసాయిరెడ్డి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి ఆరోపణల కేసులో జైలు పాలైనా ఆ పార్టీ నేతలు పెద్దగా పట్టించు కోవడం లేదని... ఇది టీడీపీ దయనీయ స్థితికి అద్దం పడుతోంది. టీడీపీ త్వరలో రెండు మూడు ముక్కలుగా చీలిపోయే సంకేతాలు కనిపిస్తున్నాయని ఎంపీ విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం సోషల్ మీడియా వేదికగా వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు.

చంద్రబాబు అవినీతి కుంభకోణం కేసు కోర్టులో ఉందని... విచారణ ఎదుర్కొనేందుకు టీడీపీ ఎందుకు భయపడు తోందని ప్రశ్నించారు. కోర్టులో నిర్దోషిగా నిర్ణయిస్తే ఆయన స్వేచ్ఛగా బయటకొస్తారని... దోషిగా తేలితే ఎమ్మెల్యేగా అనర్హుడవు తాడని తెలిపారు. ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా డిబార్ చేయబడతాడని అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే వైసీపీకి 25 ఎంపీ సీట్లు వస్తాయని, చంద్రబాబు అరెస్టు అనంతరం టైమ్స్ నౌ చేపట్టిన తాజా సర్వేలో వెల్లడించిందని తెలిపారు.

రాజ్యాంగ హక్కులు కాపాడాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- ఘనంగా డబ్ల్యూఎఫ్‌టీయూ వ్యవస్థాపక దినోత్సవం
- కార్మిక హక్కుల కోసం మానవహారం

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను కాపాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఓబులేసు కోరారు. డబ్ల్యూఎఫ్‌టీయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇక్కడి లెనిన్ సెంటర్ వద్ద కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్మిక ఉద్యమ అణిచివేతకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, ట్రేడ్ యూనియన్ హక్కుల రక్షణ కోసం మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు, రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ దేశాభివృద్ధి కోసం, ఆర్థిక పునాది కోసం, కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సమన్వయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 45 కార్మిక ఫెడరేషన్లు 500 పైగా రైతు సంఘాలు సమైక్యంగా ఏర్పడి దేశ్ కి బచావో నరేంద్ర మోడీ బతావో హటావో నినాదంతో రెండు సంవత్సరాల క్రితమే ఐక్య ఉద్యమాలకు ఒకే వేదికగా ఏర్పడ్డాయని ఇది దేశానికి శుభ సూచిక అన్నారు. ప్రభుత్వం చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మకుండా ఐక్య ఉద్యమాలలో కార్మిక వర్గం కలిసి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వి ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పౌర హక్కులపై కార్మిక వర్గంపై, ప్రజాస్వామ్యంపై సామ్రాజ్యవాదుల దాడి తీవ్రమైంది అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కరోనా కష్ట సమయంలో 29 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు కోడ్లు కార్పోరేట్ శక్తుల కోసం ఏర్పరిచారని ఎద్దేవా చేశారు. ఏఐఎంటీయూ రాష్ట్ర కార్యదర్శి జే కిషోర్ మాట్లాడుతూ దేశంలో కార్మిక వ్యతిరేక పాలన చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నరేంద్ర మోదీ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య, నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, వియ్యపు నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు, ఆర్ అజయ్ కుమార్, కేఆర్కే వెంకటేశ్వరరావు, సుబ్బరావమ్మ, ఏఐటీయూసీ శ్రామిక మహిళ నాయకురాలు కే శైలజ, ఏఐటీయూసీ విజయవాడ నగర నాయకులు చల్లా వెంకటరమణ, కొట్టు రమణ, రామస్వామి, వేముల రాంబాబు, తిరుపతయ్య, కొండా తదితరులు పాల్గొన్నారు.

బీచ్ శాండ్ మినరల్స్ కుంభకోణంపై

జగన్ సమాధానం చెప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: బీచ్ శాండ్ మినరల్స్ ప్రాజెక్టు పేరుతో ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాన్ని అదానీకి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది వేల కోట్ల రూపాయల కుంభకోణమనే ఆరోపణలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అదానీకి తీరప్రాంతాలను అప్పనంగా కట్టబెట్టేందుకుగాను బీచ్ శాండ్ మైనింగ్‌పై గల నిషేధం ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం తెరతీసిందని రామకృష్ణ విమర్శించారు. అందుకనుగుణంగా మైన్స్ అండ్ మినరల్స్ యాక్ట్-1975కు సవరణలు చేసే యత్నాలు ప్రారంభించిందని తెలిపారు. ఫలితంగా పర్యాటకరంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన హెచ్చరించారు. అదానీకి బీచ్ శాండ్ మైనింగ్ అప్పగించడం ద్వారా కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలపై పెత్తనం చెలాయించేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని రామకృష్ణ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో బీచ్ శాండ్ మినరల్స్ ప్రాజెక్టు ఏర్పాటు కోసమే ఇటీవల జగన్‌మోహన్‌రెడ్డితో అదానీ భేటీ అయినట్లు తెలుస్తోందని వివరించారు. జగన్‌తో అదానీ భేటీ అయిన మరుసటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్‌కు పిలవడం చర్చనీయాంశమైందని గుర్తుచేశారు. ఇసుకను ప్రాసెస్ చేసి టైటానియం డయాక్సైడ్, ఇల్మెనైట్, జిర్కాన్, రుటైల్, గార్నెట్, సిలిమనైట్, ల్యూకోక్సిన్ వంటి ఖనిజాలు వెలికితీస్తారని రామకృష్ణ వివరించారు. బీచ్ శాండ్ మైనింగ్ ద్వారా అణుశక్తి ఉత్పత్తికి వినియోగించే ఖనిజాలు వెలికితీసే అవకాశం ఉందని తెలిపారు. ఏపీలో పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ భూములను అదానీ కంపెనీలకు అప్పగించిన జగన్ సర్కార్ మరో అడుగు ముందుకేసి వేల కోట్ల రూపాయల విలువగల బీచ్ శాండ్ మైనింగ్‌ను అప్పగించేందుకు సిద్ధమైందని ఆరోపించారు. దీనివెనుక కోట్లాది రూపాయలు కుంభకోణం జరుగు తున్నట్లు వార్తలొస్తున్నాయని, కమీషన్ కోసమే అదానీతో జగన్ రహస్య సమావేశం జరిపినట్లు, ఆ అక్రమ సొమ్ముతోనే రానున్న ఎన్నికలకు జగన్ వెళ్లనున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అదానీ, జగన్ భేటీలో రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రిగానీ, ఆ శాఖ ముఖ్య కార్యదర్శిగానీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానీ పాల్గొనకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. జగన్, అదానీ రహస్య భేటీ వివరాలు స్వయంగా సీఎం జగన్ ప్రజలకు వెల్లడించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా: డీజీపీ

విశాలాంధ్ర-విజయవాడ: విధి నిర్వహణలో అమరుడైన కానిస్టేబుల్ గంధం నరేంద్ర కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని డీజీపీ రాజేంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 30న ఏలూరు జిల్లా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్‌తో నిర్వహిస్తున్న ఊరేగింపును త్వరగా ముగించమని నిర్వహకులకు సూచిస్తున్న కానిస్టేబుల్ గంధం నరేంద్రను స్థానిక యువకుడు ఉలస రామకృష్ణ వెనుక నుంచి కర్రతో తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడన్నారు. గాయపడిన కానిస్టేబుల్ గంధం నరేంద్రను ముందుగా విజయవాడ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కి తరలించి ప్రాణాలు కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి సీఎం అమర వీరుడైన గంధం నరేంద్ర కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి 30 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని సీఎం చెప్పారని డీజీపీ వివరించారు.

వీఐటీలో కృత్రిమ మేధస్సుతో సంగీత కచేరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించి హార్మోనీ అన్‌లీష్డ్ అనే సంగీత కచేరీ నిర్వహించారు. నల్ (ఇన్ఫోసెక్) చాప్టర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఎంట్రప్రెన్యూర్ సెల్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అర్జిత్ సింగ్ పాడిన సోను నిగమ్ 'కల్ హో నా హో', సిద్ శ్రీరామ్ పాడిన యువన్ శంకర్ రాజా 'నీ యదలో నాకు', శ్రేయా ఘోషల్ పాడటానికి శ్వేతా మోహన్ చేసిన 'వా వాతి' అందరినీ ఆకట్టుకున్నాయి. నల్ చాప్టర్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా. సి.బి.చక్రవర్తి, సాంకేతికత, సృజనాత్మకత అద్భుతమైన కలయికతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో రూపొందించిన మ్యూజిక్ వీడియోలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన నల్ చాప్టర్ ప్రెసిడెంట్ వెంకట్ హర్ష రాయసం, వైస్ ప్రెసిడెంట్ కె.ప్రణవ్ సాయి, సాయి సంజయ్ సహకారానికి డా.సి.బి.చక్రవర్తి కృతజ్ఞతలు తెలిపారు. సంగీత ప్రపంచంలో సాంకేతికత, ఆవిష్కరణల శక్తికి ఈ సంఘటన నిజమైన నిదర్శనంగా వీఐటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.జగదీష్ ముదిగంటి, డా.అమీత్ చవాన్ (డైరెక్టర్, ఐఐఈసీ), డా.హరి సీత, డా.సి.బి. చక్రవర్తి, ఎస్.శామ్యూల్ జాన్సన్, డా.సుధాకర్ ఇలంగో తదితరులు పాల్గొన్నారు.

పెడనలో అల్లర్లకు పవన్ కల్యాణ్ కుట్ర

గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వారాహి యాత్రపై దాడి చేసే అవకాశం ఉందంటూ పవన్ కల్యాణ్ నిస్సిగ్గుగా చేసిన పిచ్చి వ్యాఖ్యలను పెడన ప్రజలు ఇప్పటికే అర్థం చేసుకున్నారని, నాడు అంగళ్ల సెంటర్‌లో చంద్రబాబు ఏ విధంగా అయితే కుట్ర చేసి అల్లర్లు సృష్టించాడో, అదే తరహాలో పెడనలోనూ ఘటనలకు పవన్ పార్టీ కార్యకర్తలను పురిగొల్పుతున్నాడని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ మండిపడ్డారు. చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని పవన్ ప్రణాళిక ప్రకారమే ముందస్తు హెచ్చరికలకు పాల్పడ్డారనేది అందరికీ అర్థమవు తోందని చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వారాహిని అడ్డుకునే అవసరం మాకేంటి? అని ప్రశ్నించారు. పెడన ప్రజలు శాంతికాముకులని, వారు ఏనాడూ హింసకు పాల్పడలేదన్నారు. అవనిగడ్డ సభ ఫ్లాప్‌తో పవన్‌లో దిగులు పట్టుకుందని, పవన్ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు నిరూపించే దమ్ముందా? అని నిలదీశారు. ఆదిలోనే టీడీపీ, జనసేన పొత్తు ప్రకటించిందని, చంద్రబాబుతో జత కట్టేందుకు పవన్ తహతహలాడుతున్నారని విమర్శించారు. పవన్ నిర్ణయాన్ని ఆ పార్టీ శ్రేణులు స్వాగతించడం లేదన్నారు. అందుకే అవనిగడ్డ వారాహి సభ అట్టర్ ఫ్లాప్ అయిందని స్పష్టం చేశారు.

పరామర్శకూ తప్పని తిప్పలు

భువనేశ్వరికి అమరావతి రైతుల సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోరాటాలకే కాదు...పరామర్శలకూ పాట్లు తప్పడం లేదు. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి సంఘీభావం తెలిపేందుకు రాజమహేంద్రవరం బయలుదేరిన అమరావతి రైతులకు పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పించారు. పోలీసు ఆంక్షలు దాటుకుని ఎట్టకేలకు రాజమండ్రి చేరుకున్న రైతులు భువనేశ్వరికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం రాజకీయ కక్షతోనే చంద్రబాబును జైలుకు పంపిందని, ధైర్యంగా ఉండాలని, చంద్రబాబు త్వరలో బయటకు వస్తారని భువనేశ్వరికి రైతులు ధైర్యం చెప్పారు. అమరావతి నిర్మాణం, భూములిచ్చిన రైతుల పరిస్థితి, ప్రభుత్వ కుట్రపూరిత చర్యలపై రైతులు మాట్లాడారు. మూడు రాజధానులు అంటూ ప్రభుత్వం రాజధాని లేకుండా చేసిందని ఆరోపించారు. రాజధాని కోసం తాము చేస్తున్న పోరాటంలో ప్రభుత్వం ఎన్ని కేసులు, ఇబ్బందులు పెట్టిందో వివరించారు. తనకు అన్నీ తెలుసని, ధైర్యంగా నిలబడాలని, మళ్లీ మంచి రోజులు వస్తాయని రైతులకు భువనేశ్వరి భరోసా ఇచ్చారు. అమరావతి రైతుల త్యాగాలు వృథా కావని, అమరావతి నిర్మాణం జరిగి తీరుతుందని భువనేశ్వరి ధైర్యం చెప్పారు. రాజధాని విధ్వంసం కంటే చంద్రబాబును జైల్లో పెట్టడమే తమకు ఎక్కువ బాధ కలిగించిందని రైతులు చెప్పారు. కొందరు ఉద్వేగానికిలోనై కంటతడి పెట్టగా భువనేశ్వరి వారిని ఓదార్చారు.

అమరావతి నుంచి రాజమహేంద్రవరం వస్తున్న తమను పోలీసులు వీరవల్లి టోల్ గేట్ వద్ద అడ్డుకుని ఇబ్బందులకు గురిచేశారని మహిళలు, రైతులు భువనేశ్వరికి తెలిపారు. గంటసేపు రోడ్డుపై బైఠాయించి ఆందోళనా చేసినా కనికరించలేదని మహిళలు అన్నారు. అన్నవరం సత్యనారాయణస్వామి దేవాలయానికి వెళ్తున్నామని చెప్పిన తర్వాతే తమను అనుమతించారని పేర్కొన్నారు. తాము ఎక్కడికి వెళ్తున్నామో తెలుసుకునేందుకు పోలీసులు తమను అనుసరించారన్నారు. అమరావతి ఉద్యమం నాటి నుంచి ప్రభుత్వం తమను వేధిస్తూనే ఉందన్నారు. చంద్రబాబుపై నమ్మకంతోనే తమ భూములు రాజధానికి ఇచ్చామని రైతులు గుర్తు చేశారు. మూడు రాజధానుల నిర్ణయంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరమవడంతో పాటు రాష్ట్ర ప్రజలు రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రాజధాని ఉద్యమానికి సహకరించి, రెండు బంగారు గాజులు విరాళంగా ఇచ్చిన విషయాన్ని భువనేశ్వరికి రైతులు గుర్తు చేశారు. మందడంలో రామకోటి స్థూపాన్ని నిర్మిస్తున్నామన్న రైతులు... రామకోటి పుస్తకాన్ని భువనేశ్వరికి అందించారు.

వలసలు నివారించి... ఉపాధి పనులు చేపట్టాలి

ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర - పత్తికొండ: వలసలను నివారించి- ఉపాధి హామీ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, ఉత్తరాంధ్ర జిలాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రధాన పంటలన్నీ ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు నెలకు 10 వేల రూపాయలు కరువు పెన్షన్ తో పాటు, నెలకు 35 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలు ఉపాధి పనుల కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వలసలు వెళ్లిన వారిని తమ ఊర్లకు తిరిగి రప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి రోజుకు కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల నుంచి వ్యవసాయ కూలీలను, రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న అనంతపురంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ కూలీలు, రైతులు, మహిళలు, దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భూపేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబి రసూల్, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పి.భీమలింగప్ప, నాయకులు భాస్కర్ యాదవ్, మద్దిలేటి శెట్టి, వెంకటరామిరెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, నాగరాజు, శేషు కుమార్, రాజశేఖర్, రంగన్న, లక్ష్మన్న, నరసింహులు, ఉరుకుంద పాల్గొన్నారు.

వలంటీర్లను దూరంగా ఉంచండి

ఎన్నికల సంఘం ప్రధాన అధికారికి నిమ్మగడ్డ రమేశ్ వినతి



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా గానీ వినియోగించరాదని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.నిమ్మగడ్డ రమేశ్ కుమార్, సహాయకార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనాను కలిసి వినతిపత్రం అందించారు. ప్రజా స్వామ్యాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ కోసం హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జి.భవానీ ప్రసాద్ నేతృత్వంలో ఏర్పడిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కృషిచేస్తున్నదని వారు తెలిపారు. రాష్ట్రంలో లక్షలాది ఓట్లు తారుమారవుతున్నాయని, బోగస్ ఓట్లు తొలగించి అర్హులను ఓటర్లుగా చేర్చుకోవడానికి ప్రత్యేక కృషి జరగాలని కోరారు. ఈ బాధ్యతలు నిర్వర్తించడానికి ఎలాంటి ఎన్నికల అనుభవం లేని వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవడం, వారితో వలంటీర్లు కలిసి పనిచేయడం వలన స్వేచ్ఛాయుత ఎన్నికలకు అవరోధాలు కలుగుతున్నాయని వివరించారు. ఓటర్ల జాబితాలో లోపాలు సరిచేసే ప్రక్రియలో ఎంతో అనుభవం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులను వినియోగించుకోవాలని కోరారు. వలంటీర్లకు ఎన్నికల విధులు కేటాయించవద్దని ఎన్నికల కమిషన్ పేర్కొన్నప్పటికీ అనేకచోట్ల సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ నేతలతో కలిసి వలంటీర్లు పనిచేస్తున్నారని గుర్తుచేశారు. బోగస్ ఓట్ల రద్దుకు సరైన విధానాలు అమలు చేయకుండా రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నారన్నారు. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయకుండా స్వేచ్ఛాయుత ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించలేమన్నారు. దీనిపై ఎంకే మీనా స్పందిస్తూ వలంటీర్లను ఎన్నికల విధుల కోసం వాడుకోబోమని హామీ ఇచ్చారు. ఎన్నికల విధులలో వలంటీర్లను వినియోగిస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో నెలరోజులపాటు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసి పనిచేయబోతున్నారని, ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేక పార్టీ కార్యక్రమమా అనే అనుమానాలు కలుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం కోట్లాదిరూపాయల ప్రజాధనాన్ని ఉపయోగిస్తున్నారని, వీటిని నిరోధించాలని కోరగా అక్టోబర్ 11 నుండి ప్రారంభమవుతున్న ఆ కార్యక్రమాన్ని లోతుగా అధ్యయనం చేసి చర్యలు చేపడతానని మీనా హామీ ఇచ్చినట్లు లక్ష్మణరెడ్డి తెలిపారు.

వీఆర్ఏ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. స్థానిక హనుమాన్‌పేటలోని సంఘం నూతన కార్యాలయంలో మంగళవారం గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సమితికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షులుగా నల్లిపోగు నాగేశం, ప్రధాన కార్యదర్శిగా కొమ్మది ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వీఆర్ఏలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం పోరుబాట కొనసాగిస్తామన్నారు. వీఆర్ఏలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.10,500 వేతనంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోగలరని ప్రశ్నించారు. అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 54 శాఖలకు సంబంధించిన వివిధ విధులను గ్రామస్థాయిలో నిర్వహిస్తూ ఉన్నారని, ప్రభుత్వం వీఆర్ఏలతో పార్ట్ టైం పేరు చెప్పి పూర్తి కాలం పని చేయించుకుంటూ శ్రమ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన వారు అధికంగా ఉన్నారని తెలిపారు. నిరుపేద వర్గాలకు చెందిన వీఆర్ఏలకు ప్రభుత్వం వెంటనే పే స్కేల్ అమలు చేసి కనీస వేతనం రూ.25,250 ఇవ్వాలని, అనారోగ్యంతో బాధపడుతున్న వీఆర్ఏల స్థానంలో వారి వారసులను నామినీ వీఆర్ఏలుగా నియమించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ప్రభుత్వం స్పందించే వరకు పోరాటాలు నిర్వహించి వీఆర్ఏల చిరకాల కోరిక అయిన కనీస వేతనం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన కమిటీలో సహాయ కార్యదర్శులు ఎం.రామకృష్ణ, కె.పుల్లయ్య, టీ.నాగాంజనేయులు, ఉపాధ్యక్షులు షేక్ బాషా, సి.మణికుమార్, బి.శ్రీనివాసులు కమిటీలో యధావిధిగా కొనసాగుతారని తెలిపారు.

అఖిల భారత పోటీల్లో ఆర్టీసీ ఉద్యోగుల సత్తా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అఖిల భారత ప్రజా రవాణా సంస్థ (ఏఎస్‌ఆర్‌టీయూ) అధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు సత్తా చాటారు. గుజరాత్ వేదికగా ఏఎస్‌ఆర్‌టీయూ అధ్వర్యంలో ఇటీవల జరిగిన షటిల్ బాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. మూడు రోజులపాటు వివిధ పోటీలు కొనసాగాయి. అనంతరం గుజరాత్ ఆర్టీసీ ఎండీ, ఏఎస్‌ఆర్‌టీయూ అధికారుల చేతుల మీదుగా విజేతలు ట్రోఫీ అందుకున్నారు.

ఈ పోటీల్లో షటిల్ బాడ్మింటన్‌తో పాటు వాలీబాల్ జట్టు పాల్గొని మంచి ప్రతిభ చూపింది. గెలుపొందిన ఆటగాళ్లను సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు అభినందించారు. ఉద్యోగులు మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని కితాబు ఇచ్చారు. ప్రత్యేక శిక్షణ ఇచ్చినందుకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, కోచ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఐటీ ప్రధాన విభాగం అధికారి సాయిచరణ్ తేజ్ (అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్), నూజివీడు డిపో కండక్టర్ రమేశ్ షటిల్ బాడ్మింటన్ డబుల్స్‌లో టైటిల్ గెలుపొందారు.

హక్కుల కార్యకర్తల నోళ్లు మూయించే కుట్ర

- అందుకే ఎన్ఐఏ దాడులు
- కేంద్రం నిర్బంధ వైఖరి విడనాడాలి
- మానవ హక్కుల వేదిక

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఏపీలో ఏడుగురు మానవ హక్కులవేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) బాధ్యుల ఇళ్ళపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోమవారం వేకువజామున దాడులకు పాల్పడటాన్ని హెచ్‌ఆర్‌ఎఫ్ ఏపీ & తెలంగాణ సమన్వయ సభ్యులు వీఎస్ కృష్ణ, ఎస్ జీవనకుమార్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆదోనిలో ఏపీ హెచ్‌ఆర్‌ఎఫ్ అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, అమలాపురంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజేష్, శ్రీకాకుళంలో రాష్ట్ర ఉపా ధ్యక్షుడు కేవీ జగన్నాధరావు, అనంతపురంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ అబ్దుల్ రసూల్, ఎమ్మిగనూరులో రాష్ట్ర కార్యదర్శి యూఎం దేవేంద్ర బాబు, విశాఖపట్నంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కే సుధ, హెచ్‌ఆర్‌ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ సమన్వయ కమిటీ సభ్యులు ఏ చంద్రశేఖర్ ఇళ్లపై ఎన్ఐఏ సిబ్బంది సోదాలు చేసి కొన్ని విలువైన వస్తువులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారని, విశాఖపట్నం జిల్లాలోని (ప్రస్తుత ఏఎస్‌ఆర్ జిల్లా) ముంచింగ్ పుట్ పోలీసులు 23-11-2020న నమోదు చేసిన ఒక ఎఫ్ఐఆర్ ని అడ్డుపెట్టుకుని జరిగిన ఈ సోదాల్లో నేర నిరూపణకు సంబంధించిన ఎటువంటి వస్తువులు, పత్రాలు దొరకలేదని తెలిపారు. సుమారు ఆరు గంటల పాటు చేసిన ఈ సోదాల ద్వారా ఎన్ఐఏ సిబ్బంది సాధించింది ఏమిటంటే... మా దగ్గర నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు, సాహిత్యం స్వాధీనం చేసుకోవడమేనన్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలు, సాహిత్యం ఎప్పుడు తిరిగిస్తారని ఎన్ఐఏ అధికార్లను అడిగితే... ఆ పరికరాలలో నేరాన్ని రుజువు చేసే ఎటువంటి అంశాలు లేకపోతే వాటిని ఎన్ఐఏ హైదరాబాదు కార్యా లయం నుండి పొందవచ్చని చెప్పారన్నారు. ఇది తేలడానికి జీవిత కాలం పడుతుందని తెలిపారు. ఈ చర్యల వల్ల జరిగేది వారి రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనేన్నారు. ఎలక్ట్రా నిక్ డేటాని తారుమారు చేసి సాక్ష్యాలను సృష్టించే అవకాశం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ఈ విషయంలో రాజ్యాంగ విలువలకు అనుగు ణంగా సమగ్ర నిబంధనలను రూపొందించడం చాల అవసరమని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో వివిధ ప్రజా సంఘాలకు చెందిన 53 మంది కార్యకర్తలు, తెలంగాణలో 9 మంది కార్యకర్తల ఇళ్లపై సోదాలు జరిపి ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎన్ఐఏ ప్రకటించిందని, హెచ్‌ఆర్‌ఎఫ్‌ని 'మావోయిస్టుల అనుబంధ సంస్థ' గా అభివర్ణించిందని.. ఇంతకంటే పచ్చి అబద్ధం మరొకటి ఉండదని హెచ్‌ఆర్‌ఎఫ్ నేతలు దుయ్యబట్టారు. మానవహక్కులపై హెచ్‌ఆర్ ఎఫ్‌కున్న సైద్ధాంతిక దృక్పథం, సంస్థ కార్యాచరణ పట్ల కనీస అవగాహన ఉన్న వారికి ఎవరికైనా ఇది ఎంత ఘోరమైన అసత్యమో అర్థమవుతుందన్నారు. ఒక విశాల ప్రాతిపదిక గల స్వతంత్రమైన మానవహక్కుల ఉద్యమం అవసరమనీ, సాధ్యమనీ ప్రగాఢంగా నమ్ముతూ 1998 అక్టోబర్ 11న హెచ్‌ఆర్‌ఎఫ్ సంస్థని స్థాపించాం. ఈ నెలలో హెచ్‌ఆర్ ఎఫ్‌కి 25ఏళ్లు నిండుతాయి. సమాజంలో మానవహక్కుల సంస్కృతిని పెంపొందించడానికి చేసే ప్రయత్నాలలో ఎవరెన్ని అవాంతరాలు కలిగించినా మేము మా పనిని మరింత దృఢ సంకల్పంతో కొనసాగిస్తాం. నిరసన గొంతులను నులమడానికి కేంద్ర పాలకులు ఎన్ఐఏని పావుగా వాడుకుంటున్నారనే వదంతి సమాజంలో ప్రబలంగా ఉంది. అందులో నిజం లేకపోలేదు. నిరాధార ఆరోపణలు, దర్యాప్తుల పేరిట వారు ప్రధానంగా చేయ దలచింది హక్కుల కార్యకర్తలను భయపెట్టి, ఏకాకులను చేసి, వారిని అగౌరవానికి గురిచేసి వారి నోళ్లు మూయించడమే. ఇవన్నీ ప్రజల దృష్టిలో మానవహక్కులపై గౌరవ భావం తగ్గడానికి, దాని సాధికారతను దెబ్బతీయడానికి చేస్తున్న ప్రయత్నాలు తప్ప మరొకటి కాదు. రాజకీయ పాలనా యంత్రాంగం అవలంబించే అప్రజాస్వామిక విధానాలు, కార్యాచరణలను విమర్శించే వారిని వేధించడానికే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడు తున్నారన్నారు. చట్టాన్ని ఈవిధంగా దిగజార్చడాన్ని ఆపాలని, హక్కుల కార్యకర్తలపై చేపడుతున్న వేధింపు చర్యలను ఎన్ఐఏ తక్షణం నిలిపి వేయాలని, ప్రజాస్వామ్యంలో చోటులేని రాజద్రోహం, ఉపా చట్టాలను వెంటనే రద్దు చేయాలని హెచ్‌ఆర్‌ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు.

సంపాదకీయం

లొంగని మీడియా గొంతు నొక్కడమే

మోదీ ప్రభుత్వం మళ్లీ మీడియా మీద విరుచుకుపడింది. ఈ సారి న్యూస్‌క్లిక్ అనే వెబ్ మీడియా సంస్థకు సంబంధించిన అన్ని చోట్లా మంగళవారం భారీ సంఖ్యలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆగస్టు అయిదవ తేదీన అమెరికా నుంచి వెలువడే న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఈ సంస్థకు ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేయడానికి డబ్బులు అందుతున్నాయన్న వార్త వెలువడింది. ఆ తరవాత ఆగస్టు 17వ తేదీన న్యూస్ క్లిక్‌పై కేసు నమోదు చేశారు. న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు, సంపాదకుడు ప్రబీర్ పురకాయస్థ ఆఫీసులు, ఇంటి మీద పోలీసులు విరుచుకు పడ్డారు. న్యూస్ క్లిక్ కార్యాలయాల మీద దాడులతో దిల్లీ పోలీసులు ఆగలేదు. అందులో పనిచేసే, ఆ వెబ్ సంస్థ కార్యక్రమాల్లో, చర్చల్లో పాల్గొనే వారిని, వ్యాసాలు రాసే వారి మీద మంగళవారం ఉదయం ఆరు గంటలకు అన్ని చోట్ల ఏక కాలంలో దాడులకు దిగారు. అనేక మంది పత్రికా రచయితల ఇళ్లల్లోకి జొరబడి, వారి పడక గదుల్లోకి కూడా ప్రవేశించి వారి లాప్‌టాప్ లు, మొబైల్ ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను లాక్కెళ్లారు. న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకుడు ప్రబీర్ పురకాయస్థ తో పాటు పత్రికా రచయితలు అభిసార్ శర్మ, ఊర్మిలేశ్, భాషా సింగ్, బప్పా సింగ్, పరంజయ్ గుహా తకుర్తా, అనిందో చక్రవర్తి, సుమేధ పాల్, ఆరిత్రి దాస్ కూడా ఉన్నారు. తీస్తా సెతల్వాడ్ నడుపుతున్న ముంబైలోని ట్రై కాంటినెంటల్ అనే సంస్థ మీద కూడా దాడులు చేశారు. తీస్తా సెతల్వాడ్ 2002 నాటి గుజరాత్ మారణకాండ బాధితులకు న్యాయం చేయడంకోసం పోరాడారు. ఆమె నడుపుతున్న సంస్థ ట్రైకాంటినెంటల్ న్యూస్ క్లిక్ కు వ్యాసాలు సరఫరా చేస్తూ ఉంటుంది. దాడికి గురైన వారిలో ఆ సంస్థలో పని చేసే జర్నలిస్టులతో పాటు ఆ వెబ్ సైట్ కు వ్యాసాలు రాసేవారు, చర్చల్లో పాల్గొనే వారిని కూడా వదలకుండా దాడులు చేశారు. దాడికి గురైన వారిలో చరిత్ర కారుడు సొహైల్ హాష్మీ, వ్యంగ్యకారుడు సంజయ్ రజౌరా కూడా ఉన్నారు. చివరకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఇంటి మీద కూడా దాడి జరిగింది. ఆయన సహచరుడు ఒకరు ఏచూరితో పాటు ఆ ఇంట్లోనే ఉంటారు. ఆ సహచరుడి కుమారుడు న్యూస్ క్లిక్‌లో పని చేస్తారట. అందువల్ల ఏచూరి ఇంటినీ వదిలిపెట్టలేదు. న్యూ యార్క్ టైమ్స్ పత్రికలో ప్రచురితమైన వార్తలో న్యూస్ క్లిక్ సంస్థతో పాటు కొందరు పత్రికా రచయితలకు చైనా నుంచి డబ్బు అందుతోందని ఆరోపించారు. ఈ ఆరోపణ ఆధారంగా వీరందరి మీద దాడి చేశారు. చైనా కు అనుకూలమైన వార్తలు, వ్యాఖ్యలు రాయడానికి అమెరికాలో నివసించే సాంకేతిక వ్యవహారాల్లో నిపుణుడు నెవిల్లి రాయ్ సింగం డబ్బులు ముట్ట చెప్తున్నారని న్యూ యార్క్ టైమ్స్ ఆరోపించింది. సింగం అధీనంలోని సంస్థలు చైనాకు అనుకూల సమాచారం ప్రచారంలో పెట్టడానికి తప్పుడు సమాచారాన్ని వార్తా సంస్థలకు అందజేస్తున్నాయన్న ఆరోపణ ఉంది. ఈ కేసులో భయంకరమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) లోని కొన్ని సెక్షన్లను, వివిధ వర్గాల మతాల మధ్య చిచ్చు పెట్టడానికి సంబంధించిన భారత శిక్షా స్మృతిలోని 153 (ఎ) సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు.

యు.ఎ.పి.ఎ. చట్టం కింద కేసులున్న వారు బెయిలు సంపాదించడం దాదాపు అసాధ్యం అయిపోతోంది. ఆ చట్టం కింద అరెస్టయిన వారు అటు బెయిలు రాక, ఇటు విచారణ ప్రారంభం కాక ఏళ్ల తరబడి జైళ్లల్లో మగ్గడం చూస్తూనే ఉన్నాం. యు.ఎ.పి.ఎ. చట్టానికి అనుగుణంగా కేసులు మోపడమే దారుణం అనుకుంటే 153 (ఎ) సెక్షన్ కింద కేసు నమోదు చయడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే. అయితే, ఈ కేసులో న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధినేత అమిత్ చక్రవర్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు సాయంత్రం నిర్ధారించారు. ఈ కేసులో మొత్తం 37 మంది పురుషులు, తొమ్మిది మంది మహిళా జర్నలిస్టులు, సిబ్బందిని పోలీసులు ప్రశ్నించారు.

కిట్టని మీడియా సంస్థల మీద మోదీ ప్రభుత్వం దాడులు చేయడం ఇది మొదటి సారి కాదు. 2017లోనే ప్రణయ్ రాయ్, రాధికా రాయ్ నడుపుతున్న ఎన్.డి.టీ.వీ. మీద దాడులు చేశారు. అప్పుడు వారి మీద ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. ఆ తరవాత ఎన్.డి.టీ.వీ.ని అదానీ కొనేశారు. అదానీ ఓ పరిశ్రమనో, విమానాశ్రయాన్నో, రేవు పట్టణాన్నో, మరో సంస్థనో కొనాలనుకుంటే ఆ సంస్థల మీద కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, అందులో అంతర్భాగమైన ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ లాంటివి ముందు దాడి చేసి బెదరగొడ్తాయి. ఆ తరవాత అవి అదానీ వశమవుతాయి. మోదీ ప్రభుత్వం 2021 ఏప్రిల్ లో దైనిక్ భాస్కర్ పత్రిక మీద దాడి చేసింది. ఆ పత్రిక గుజరాత్ బీజేపీ విభాగం అధ్యక్షుడు వఘానీ ఫోన్ నెంబర్ ప్రచురించిందన్న ఆరోపణ ఉంది. అలాగే అనేక మంది భారతీయ జర్నలిస్టుల మీద పెగాసస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ప్రభుత్వం నిఘా పెట్టింది అని కూడా రాసింది. కరోనా సమయంలో ఆక్సిజన్ దొరకక, ఆసుపత్రుల్లో పడకలు దొరకక జనం ఎన్ని కష్టాలు పడ్తుతున్నారో అనేక కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలోనే దైనిక్ భాస్కర్ మీద విరుచుకు పడ్డారు. గత ఫిబ్రవరిలో మన దేశంలోని బి.బి.సి. వార్తా సంస్థ కార్యాలయంపై కూడా మోదీ ప్రభుత్వం దాడులకు తెగబడింది. భారత్ సమాచార్, దైనిక్ భాస్కర్ పత్రికలు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నాయన్న ఆరోపణతో ఆదాయం పన్ను శాఖ 2021 జులైలో ఆ సంస్థల ఆవరణలలోకి చొరబడి దాడులు చేసింది. న్యూస్ క్లిక్ సంస్థ మీద చైనాకు అనుకూలంగా ప్రచారం చేయడం కోసం డబ్బులు ముడ్తున్నాయన్న ఆరోపణ కొత్త కాదు. కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ మాత్రం "దర్యాప్తు సంస్థలు స్వతంత్రమైనవి. నిబంధనలకు అనుగుణంగా వాటి పని అవి చేస్తున్నాయి. అందువల్ల ఈ దాడులను సమర్థించ నక్కర్లేదు. ఎవరైనా తప్పు చేస్తే దర్యాప్తు సంస్థలు వాటి పని అవి చేసుకుపోతాయి" అన్నారు. తప్పుడు వనరుల నుంచి డబ్బు అందితే చర్య తీసుకోకూడదని ఎక్కడా రాసి లేదు కదా అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. మన దేశం ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిది అని ప్రధానమంత్రి మోదీ విరామం లేకుండా చెప్తుంటారు. కాని పత్రికా స్వేచ్ఛ విషయంలో మనం అట్టడుగున 142వ స్థానంలో ఉన్నాం. మన సరసన ఉన్నవి మైన్మార్, మెక్సికో లాంటి దేశాలే. స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి సాహసించే మీడియా గొంతు నొక్కడం మోదీ ప్రభుత్వం చాలా కాలంగా చేస్తున్న పనే.

డీలాపడిన బీజేపీ

మక్కెన సుబ్బారావు

ఐదు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు భారత ఎన్నికల కమిషన్ వచ్చే నెలలో షెడ్యూలు ప్రకటించనుంది. వచ్చే ఏప్రిల్-మే మాసాల్లో జరిగే లోక్సభ ఎన్నికలకు సెమీ ఫైనల్లాంటి ఈ ఎన్నికలకు అసాధారణంగా ఎంతో ముందునుంచే రాజకీయ పార్టీలు సన్నాహాలు ఆరంభించటంతో రాజకీయ వేడి పెరుగుతోంది. ఆయారాం-గయారంలు జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ కాంగ్రెస్ పాలనలో ఉండగా, గత ఎన్నికల్లో కాంగ్రెస్ వశమైన మధ్యప్రదేశ్ ఫిరాయింపులు ప్రోత్సహించి బీజేపీ తిరిగి తమ ఖాతాలో వేసుకుంది. తెలంగాణ బిఆర్‌ఎస్ ఏలుబడిలో ఉండగా, మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) అధికారం సాగిస్తోంది. అయితే లోక్సభ ఎన్నికలకు కూడా ఇప్పటికే రాజకీయ కసరత్తు మొదలై 28 ప్రతిపక్షపార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడ్డాయి. బీజేపీ సంఖ్యరీత్యా అంతకన్నా ఎక్కువ పార్టీలనే కూడగట్టింది. విస్తృత ఎన్డీఏ సమావేశం తర్వాత మళ్లీ ఊసువినబడటంలేదు. వాటిలో అత్యధికం ఒకటి, రెండు అసెంబ్లీ లేక పార్లమెంటు సీట్లకు పోటీచేసే స్థానిక పార్టీలే అయినందున షో అంతా బీజేపీదే. అయితే పరిణామాలు దానికి ఆందోళనకరంగా ఉండటంతో కొత్త మిత్రులకోసం వెదుకుతోంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు కేంద్ర మంత్రులు సహా ఏడుగురు ఎంపీలను (అందరూ ముఖ్యనాయకులు) రంగంలోకి దించింది. ప్రధాని నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్, రాజస్థాన్లో ఎన్నికల ప్రచారశంఖం పూరించారు. ఎన్డీఏ భాగస్వామ్యంలో చెప్పుకోదగ్గ పార్టీ లేదు. అన్నాడీఎంకె, తమిళనాడులో బీజేపీతో పొత్తువదులుకున్నది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం ద్వారాలు మూసుకుపోయాయి. అయితే అక్కడ దేవగౌడ జెడీ(యు) ను ఆకర్షించి సూత్రప్రాయంగా ఎన్నికల పొత్తు ఖరారు చేసుకున్న సంతోషంపై తమిళనాడు నీళ్లు చల్లింది.

దేవగౌడ దిగజారుడు

పార్టీ పేరులోనే 'సెక్యులర్' చేర్చుకున్న పార్టీ మాజీ ప్రధాని హెచ్ దేవగౌడ జనతాదళ్ (ఎస్). యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రధానమంత్రి అయినారు. రాష్ట్రంలో మైసూర్ ప్రాంతంలో ప్రభావవంతమైన వక్కిళిగ సామాజిక తరగతి అర్హతతోనే ఆయన 1996లో ఆయన పార్టీ పునాది ఏర్పడింది. కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి. కాంగ్రెస్-బీజేపీ మధ్య పోరాటంలో కింగ్మేకర్ పాత్రతో ఆయన కుమారుడు కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రి అయినాడు. (2004, 2018) ఒకసారి బీజేపీ, మరోసారి కాంగ్రెస్తో పొత్తులతో 2023 ఎన్నికలో ఓటర్లు ఆయనకు ఆ అదృష్టంలేకుండా కాంగ్రెస్కు పూర్తి మెజారిటీ ఇచ్చారు. కాబట్టి దేవగౌడ తమ పార్టీ ఉనికిని భద్రంచేసుకునే నిమిత్తం వచ్చే లోక్సభ ఎన్నికలకు బీజేపీతో పొత్తు ఎంచుకున్నాడు. అమిత్ షా తో ముందుగా తాను మాట్లాడి, పార్టీ అధ్యక్షుడైన కుమారస్వామిని దిల్లీ పంపి పొత్తు ఖరారు చేసుకున్నాడు. కనీసం ఆరేడు లోక్సభ సీట్ల కేటాయింపును ఆశిస్తున్నాడని

> తెలంగాణ రాష్ట్ర మూడవ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల క్షేత్రంలో అనూహ్యంగా మారింది. మునుగోడు ఉపఎన్నికకు ముందు వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామంటూ బస్తీ మే సవాల్ అన్న బీజేపీ ఒక్కసారిగా ఆ ఊపు కోల్పోయింది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ పొంగు చల్లారింది. పోటీతత్వం కూడా కోల్పోయినట్లు కనిపిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్తో లోపాయికారి అవగాహన ఏదో కుదిరిందని, అందువల్లనే ఆయన బీజేపీపై విమర్శలు విరమించాలని, కమ్యూనిస్టులతో కోరుకున్న మైత్రిని విడనాడాలని నిర్ణయించాం. ఈ పరిణామాలతో కాంగ్రెస్ రొట్టెవిరిగి నేతిలో పడినట్లయింది. హుషారు, ఐకమత్యం, పునరాగమనాలు పెరుగుతున్నాయి.

వార్తలు చెబుతున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా అత్యధిక లోక్సభ సీట్లు గెలవాలని ఆశిస్తున్న బీజేపీకి కూడా తోడుఅవసరమైనందున పొత్తు ఖరారైంది. 16 సంవత్సరాల తర్వాత రెండుపార్టీలు జట్టుకట్టాయి. ఆనాడు సంకీర్ణప్రభుత్వంపై ఒప్పందం ప్రకారం కుమారస్వామి తన గడువు ముగియగానే రాజీనామా చేయకపోవటంతో ఆ పొత్తు ఆగ్రహావేశాల మధ్య ముగిసింది.

మధ్యప్రదేశ్ క్షేత్రంలో ఎంపీలు

2018 అసెంబ్లీ ఎన్నికల తదుపరి ఓ సంవత్సరకాలం మినహా 18 సంవత్సరాలుగా మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న బీజేపీకి భయం పట్టుకున్నట్లుంది. కాంగ్రెస్ నుండి జ్యోతిరాదిత్య సింధియా గ్రూపు బీజేపీలో చేరిక అనంతరం కూడా ఈ ఆందోళన ఎందుకో! సర్వేలన్నీ కాంగ్రెస్ గెలుపును సూచిస్తున్నాయి. అందుకే బీజేపీ ఏ చిన్న అవకాశాన్ని చేజార్చుకోదలచలేదు. కొద్దిరోజుల క్రితం 39 మందితో ప్రకటించిన తమ అభ్యర్థుల రెండవ జాబితాలో ఏకంగా ఏడుగురు లోక్సభ సభ్యులను దిగుమతిచేసింది. కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, సహాయ మంత్రులు ప్రహ్లాద్ సింగ్ పటేల్, ఫగ్గన్ జింగ్ కులస్తే వారిలో ఉన్నారు. పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కైలాస్ విజయ్ వర్గీకు కూడా సీటు కేటాయించారు. రెండు విడతల్లో 78 మంది అభ్యర్థులను ప్రకటించినప్పటికీ అందులో ముఖ్యమంత్రి శివరాజ్సింగ్ చౌహాన్ పేరు లేకపోవడం గమనార్హం.

ఇటీవల అమితా షా, ప్రధాని నరేంద్ర మెదీ ప్రసంగించిన సభల్లో వారు చౌహాన్ పేరు ప్రస్తావించలేదు. దీన్నిబట్టి గతంలో అసోంలోలాగా ముఖ్యమంత్రిని మార్చవచ్చునని ఊహాగానాలు వినిపిసుతన్నాయి. "ఈ రెండవ జాబితాలో మా విజయం ఖరారైంది. మా సీనియర్ నాయకులందరూ పోటీ చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి చౌహాన్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ రాష్ట్ర మూడవ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల క్షేత్రంలో అనూహ్యంగా మారింది. మునుగోడు ఉపఎన్నికకు ముందు వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామంటూ బస్తీ మే సవాల్ అన్న బీజేపీ ఒక్కసారిగా ఆ ఊపు కోల్పోయింది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ పొంగు చల్లారింది. పోటీతత్వం కూడా కోల్పోయినట్లు కనిపిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్తో లోపాయికారి అవగాహన ఏదో కుదిరిందని, అందువల్లనే ఆయన బీజేపీపై విమర్శలు విరమించాలని, కమ్యూనిస్టులతో కోరుకున్న మైత్రిని విడనాడాలని నిర్ణయించాం. ఈ పరిణామాలతో కాంగ్రెస్ రొట్టెవిరిగి నేతిలో పడినట్లయింది. హుషారు, ఐకమత్యం, పునరాగమనాలు పెరుగుతున్నాయి. ఒకనాటి నైరాశ్యంపోయి తమదే అధికారం అంటున్నారు. రెండోవైపున, కొండంత ఆశతో టీఆర్‌ఎస్ను బిఆర్‌ఎస్ మార్చినా అదంతా వృథా ప్రయాస అని తేలిపోయింది. అందువల్ల కాంగ్రెస్ను నిరోధించేందుకు కేంద్రంతో సఖ్యతతో మెలిగే పాత వ్యూహమే మేలని భావిస్తున్నట్లున్నాడు. ఎన్నికల సమరం ఆసక్తికరంగా మారింది.

రాజస్థాన్, చత్తీస్ ఘడ్ నిలుపుకుంటామని, మధ్యప్రదేశ్ను గెలుచు కుంటామని కాంగ్రెస్ ధీమాతో ఉంది. తెలంగాణపై కూడా ఆశలు పెంచుకుంటున్నది. రాజస్థాన్ అధికారం ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య చేతులు మారుతూ ఉంటుంది. ఈ పర్యాయం ఓటర్లు ఆ సాంప్రదాయాన్ని మార్చుతారా?

ఎమ్.సుబ్బారావు,
సీనియర్ జర్నలిస్టు

మళ్లీ ఎన్నికల బాండ్లు

నిత్య చక్రవర్తి

ప్రతిసారీ ఎన్నికలు జరగడానికి ముందు బాండ్లు విడుదలచేసి వాటి ద్వారా డబ్బు సమీకరించడం బీజేపీ ప్రభుత్వానికి బాగా అలవాటైంది. అక్టోబరు 4వ తేదీ నుంచి 28వ సారి ఎన్నికల బాండ్లను విక్రయిస్తోంది. నాలుగోతేదీ నుంచి పదిరోజుల పాటు ఈ బాండ్లను విక్రయిస్తారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు త్వరలో ఎన్నికలు జరుగనుండగా, ఈ బాండ్ల ద్వారా బీజేపీ భారీగా నిధులను పొందనున్నది. ఎన్నికల ప్రచారానికి ఓటర్లను ఆకర్షించడానికి నిధులు ఖర్చు చేస్తారు. బాండ్ల ద్వారా సేకరించే డబ్బులు 80నుంచి 90శాతం వరకు పాలకపార్టీకే లభిస్తాయి. ఎన్నికల బాండ్ల వ్యవహారం సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. ఇతర పార్టీలకు పెద్దగా నిధులు బాండ్ల ద్వారా రావు. అలాగే పారిశ్రామిక వేత్తలనుండి కూడా బీజేపీలాంటి పెద్దపార్టీలకే నిధులు చేరతాయి. ఈ ఎన్నికల బాండ్లను 2017లో సవాలుచేస్తూ, అనేకమంది పిటిషన్లు వేశారు. మొట్టమొదట 2018లో ఎన్నికల బాండ్ల పథకాన్ని అమలు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.వై. చంద్రచూడ్ ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తానని అది పిటిషన్లను విచారణ జరుపుతుందని చెప్పారు. అయితే ఇంతవరకు విచారణ ఏమీ జరగలేదు.

25వసారి ఎన్నికల బాండ్లను విక్రయించే సమయంలో ప్రధాని మోదీ ప్రభుత్వం పద్ధతిని ఉల్లంఘించారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని గత ఏడాది నవంబరు ఏడున హడావుడిగా ప్రతిసారీ 10రోజులపాటు విక్రయించే గడువును అదనంగా 15రోజులు పెంచారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్నికలు జరగవలసిఉండగా 15రోజులు పొడిగించారు. నియమ నిబంధనల ప్రకారం, బాండ్లను కొనుగోలు చేయడం జనవరి, ఏప్రిల్,జులై,అక్టోబరులలో ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల సంవత్సరాలలో అదనంగా 30రోజులు విక్రయాలను అనుమతిస్తారు. తాజా సవరణప్రకారం, కేంద్రప్రభుత్వం 2022న వంబరులో మరోసారి విక్రయించడానికి అనుమతించారు. ఎందుకంటే, గతేడాది హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ లలో ఎన్నికలు జరిగాయి. 2018 జనవరిలో ఎన్నికల బాండ్ల విక్రయం ప్రారంభమైన తర్వాత గడచిన ఐదేళ్లలో బీజేపీ వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాలను అస్థిరీకరించేందుకు వేలదికోట్ల రూపాయలు ఖర్చుచేసింది. కర్నాటక, మధ్యప్రదేశ్, ప్రభుత్వాలను అస్థిరీకించడంతోపాటు గోవా, మణిపూర్‌లలో ఎంఎల్‌ఏలను కొనుగోలుచేసిందన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు భారీ మొత్తాలను ఖర్చుచేశారు. 2022జులైలో ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చేందుకు శివసేన నుంచి ఏక్‌నాథ్‌షిండే గ్రూపు ఎంఎల్‌ఏలను పార్టీమార్పిడి ద్వారా నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. ఏక్‌నాథ్‌షిండేకు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడమేకాకుండా శివసేన నుండి బైటకువచ్చేందుకు ఒక్కొక్కఎ ంఎల్‌ఏకి 100కోట్లు ఇచ్చారన్న ప్రచారంసాగింది.

ఆ తరువాత షిండే నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలను అస్థిరకరించడానికి బీజేపీ భారీ మొత్తాల్లో విరాళాలు, ఎన్నికల బాండ్ల ద్వారా సమీకరించి ఖర్చు చేశారు. విదేశాలనుంచి కూడా భారీగా నిధులు బీజేపీకి పార్టీ సానుభూతిపరులు పంపినట్లుగా ప్రచారం జరిగింది. కార్పొరేట్లకు చెందిన ఎలక్టొరల్ ట్రస్ట్ వివిధ రాజకీయ పార్టీలకు నిధులను మంజూరు చేశాయి. ఈ విధంగా బీజేపీ అన్ని పార్టీలకంటే 80శాతం ఎక్కువ నిధులను ఇటీవల సమీకరించింది. కేంద్రంలోని పాలకపార్టీకి అనుకూలంగాఉండి భారీగా నిధులు సమకూర్చి తమ పనులు చేయించుకునేందుకు కార్పొరేట్లు, పెద్దపెద్ద కంపెనీలు సిద్ధంగాఉంటాయి. ఇక ప్రత్యర్థుల మీద ఐటీ, సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు సంస్థలను ప్రోత్సహించి వారిని వేధించడం బీజేపీ అధికారానికి వచ్చిన నాటినుంచి విపరీతమైంది. గత ఏడాది రాహుల్ గాంధీతో మాట్లాడినందుకుగాను బజాజ్ కుటుంబానికి చెందిన రాజీవ్ బజాజ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులకు పూనుకున్నాయి. పారిశ్రామిక వేత్తల కుటుంబాలలో యువకులు బీజేపీని ఇష్టపడటంలేదు. దీనితో దేశీయ కార్పొరేట్లుతమ మీద ఎక్కడ దాడులు జరుగుతాయోనని భయాందోళనలతో ఉన్నారు. యువకులు ఏమీ మాట్లాడకుండా మౌనంగా తమ పనులు చేసుకుపోతున్నారు. ప్రతిపక్షాలు ఎన్నికల్లో చేసే ఖర్చుకంటే పదిరెట్లు ఎక్కువగా బీజేపీ డబ్బు ఖర్చుచేస్తోంది. కొన్ని చోట్ల డబ్బు నీళ్లలాగా పారిస్తోందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. గత తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశీయ కార్పొరేట్ రంగంలో ఉన్నవారి వద్ద అసాధారణంగా సంపదచేరింది. 1990లో అత్యధికంగా లాభాలుపొందే 20సంస్థలకు మొత్తం కార్పొరేట్ లాభాల్లో 14శాతం లభించింది. 2010లో ఈ లాభాలు 30శాతం కాగా, 2019నాటికి అవి 70శాతానికి చేరాయి. నరేంద్ర మోదీ మొదటి ఐదేళ్లపాలనలో కొద్దిమంది కార్పొరేట్ల వద్ద అపారంగా సంపద చేరింది. గత నాలుగేళ్లలో ఈ పరిస్థితి మరింత వేగవంతమైంది. బీజేపీ ప్రభుత్వానికి, బడా పారిశ్రామికవేత్తలకు మధ్య బలమైన స్నేహబంధం ఏర్పడింది. భారతదేశంలో మోదీ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిపుచ్చుకునే పద్ధతి గాఢమైంది.

ఏదైనా సొంత లాభం కోసమే

కూనంనేని సాంబశివరావు

ప్రధాని మోదీ మరోమారు తెలుగు ప్రజలపై ప్రత్యేకించి తెలంగాణ ఏర్పాటుపై అక్కసును ఉద్దేశ పూర్వకంగానే వెళ్ళగక్కినట్లు స్పష్టమవుతోంది. పార్లమెంటు పాత భవనంలోని చివరి సమావేశం సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనం. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో (సెప్టెంబరు 18 నుంచి 22 వరకు) ప్రధాని మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం అనేక మంది యువకులు, విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారు, భారీ పోరాటాలు జరిగాయి..రక్తం పారింది. కానీ రాష్ట్ర ఏర్పాటు తరువాత అటు తెలంగాణ ప్రజలు ఉత్సవాలు చేసుకోలేదు. ఇటు ఆంధ్రా ప్రజలు సంతోషంగా లేరు అని మోదీ అన్నారు. ఇది పూర్తిగా సత్యదూరమైన విషయం. తెలంగాణ రాష్ట్ర అపాయింటెడ్ డేట్ 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ సబ్బండ వర్గాల ప్రజలంతా వీధుల్లోకి వచ్చి ఆనంద భాష్పాలతో ఉత్సవాలు జరుపుకున్నారనేది చారిత్రక వాస్తవం.

తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా మోదీ వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. 2014 ఎన్నికల సందర్భంగా కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సభల్లో కూడా తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని అన్నారు. ఆ తరువాత ప్రధాని అయ్యాక కూడా మోదీ తెలంగాణ ఏర్పాటుపై వ్యతిరేకతను చాటుకున్నారు. మూడు, నాలుగు సందర్భాలలో "ఎలాంటి చర్చ లేకుండానే పార్లమెంటులో కూడా తలుపులు మూసేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, పెప్పర్ స్ప్రే చేశారు". అని పార్లమెంటు వేదికగా వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయి. సాధారణంగా పార్లమెంటులో ఏ బిల్లుపైనైనా డివిజన్ (ఓటింగ్) కోరినప్పుడు, లోక్‌సభ, రాజ్యసభ సమావేశ మందిరాలలోకి అడుగుపెట్టడానికి వీలులేకుండా తలుపులన్నీ మూసి వేయాలి. లాబీల్లో ఎవరు లేకుండా చూడాలని ఆయా సభాపతులు ఆదేశాలు ఇవ్వడం సర్వ సాధారణమని, 2001 నుండి ఇప్పటి వరకు వరుసగా ముఖ్యమంత్రి, లేదా ప్రధాన మంత్రి పదవిలో నిరంతరాయంగా ఉన్న మోదీకి తెలియనిది కాదే? అసలు చర్చ జరగలేదనేది పచ్చి అబద్ధం. నాడు అధికార యుపిఏ, కమ్యూనిస్టు పార్టీతో పాటు ప్రతిపక్ష బీజేపీ సైతం సంపూర్ణ మద్దతు పలకడంతోనే తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో పాస్ అయ్యింది. ఎట్టి పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతుతో బిల్లు పాసవుతుందనే నిర్ధారణకు వచ్చి నిరాశ నిస్పృహలకు లోనైన ఒకరిద్దరు ఎంపీలు ఆ బిల్లును ఎలాగైనా అడ్డుకోవాలనే ఆక్రోశంతో లోక్‌సభలో గందరగోళం సృష్టించేందుకు సహచర ఎంపిలపై పెప్పర్ స్ప్రే చేశారు. అయినప్పటికీ లోక్ సభలో బిల్లు పాసైంది. దానిని బీజేపీ కూడా తప్పుబట్టలేదు. లోకసభలో జరిగిన పరిణామాలతో, రాజ్యసభలో అనేక గంటలపాటు ఇదే బిల్లుపై సాఫీగా జరిగిన చర్చను, అనంతరం ఓటింగ్ ప్రక్రియను దేశమంతటా ప్రజలు టివిల ప్రత్యక్ష ప్రసారంలో చూశారు.

నిజంగా నాడు తప్పు జరిగిందని ప్రధాని భావించిఉంటే, గడిచిన తొమ్మిదిన్నరేళ్ళలో అధికారంలో ఉన్న మోదీ ఎందుకు సరిచేయలేదు? ఆయనకు చిత్తశుద్ధే ఉంటే పునర్విభజన చట్టంలో ఉభయ రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదు? తెలంగాణలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, గిరిజన విశ్వవిద్యాలయం, వంటివి ఎందుకు అమలు చేయలేదు. రాజ్యసభ సాక్షిగా బిల్లు పాసైన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తరుపున నాటి ప్రధాని ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామన్నమాటను ఎందుకు ఇప్పటి వరకు విస్మరించారు? వీటికి సమాధానం చెప్పాలి.

తెలంగాణ అంశం భావోద్వేగాలతోపాటు, చారిత్రక వాస్తవాలతో కూడుకున్నది. నాటి ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు ప్రజలు ఒక్క రాష్ట్రంగా విశాలాంధ్ర పేరుతో ఏర్పడాలని కమ్యూనిస్టు పార్టీ భావించి, పోరాటం చేసింది. రాష్ట్ర ఏర్పడిన తరువాత నిధులు, ఉద్యోగాల విషయంలో కొంత వివక్ష ఏర్పడడంతో 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగింది. రాష్ట్రం ఏర్పడి ఎక్కువ కాలం కాలేదు కాబట్టి దానిని నాడు వ్యతిరేకించిన సీపీఐ, క్రమంగా వివక్ష ప్రస్ఫుటమవుతుండడంతో తొలుత 1999లో వరంగల్ డిక్లరేషన్ పేరిట తెలంగాణ అభివృద్ధికి రూ.5వేల కోట్ల ప్యాకేజీ, ఈ ప్రాంత ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడం, ప్రాంతీయ అభివృద్ధి మండలి ఏర్పాటు చేయడం వంటి డిమాండ్‌లు చేసింది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడంతో పాటు మలి దశ ఉద్యమం రావడం, లెక్కలతో సహా తెలంగాణకు జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రాష్ట్రానికి సీపీఐ మద్దతు ప్రకటించింది. ఆ తరువాత 2014లో రాష్ట్ర ఏర్పడింది. బీజేపీ సైతం 90వ దశకంలోనే తెలంగాణకు అనుకూలంగా ఒక ఓటు రెండు రాష్ట్రాల పేరుతో కాకినాడ తీర్మానం చేసింది.తరువాత వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యుపిఏ ఎజెండాలోకి తెలంగాణ వచ్చి చివరకు 2014లో పార్లమెంటు ఆమోదం పొందగలిగింది. తెలంగాణ ఏర్పాటులో చిన్నమ్మ పాత్రను కూడా గుర్తుంచుకోవాలని ఆనాటి కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనాయకురాలు సుష్మాస్వరాజ్ తన గురించి తాను చెప్పిన విషయం వాస్తవం కాదా..?.

బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం చేసినా, ప్రధానమంత్రి స్థాయిలో ఆయన ఏ ప్రకటన చేసినా దేశ హితంకంటే తన పార్టీ హితము, తన పదవీ లాలసత మాత్రమే కనిపిస్తాయి. విభజన గురించి ప్రస్తావన చేసినా..ఉమ్మడి పౌరస్మృతి గురించి ప్రకటన చేసినా, అయోధ్య రామమందిర అంశంపై గాని, ఇప్పుడు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలని పేరుచెప్పి పార్లమెంట్ సభ్యులకు కూడా చివరి నిమిషం వరకు ఏమీ తెలియకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినా అన్ని అంశాలు ఓట్ల రాజకీయంపైనే ప్రధానమంత్రి కేంద్రీకరణ ఉంటుంది. ఇందులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశం కూడా తక్షణ రాజకీయ ప్రయోజనాన్ని ఉద్దేశించిందే. ఈ బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే గత తొమ్మిది సంవత్సరాల నుంచి బిల్లు ప్రస్తావన తీసుకురాకుండా ఎన్నికల ముందే ప్రవేశపెట్టడం, అమలుకు సంబందించి పునర్విభజన, జనాభా గణన తర్వాత ఏ సంవత్సరం ఈ బిల్లు అమల్లోకి వస్తుందో ఊహకు అందని విషయం. బిల్లులో మహిళలకు ఓబిసి కోటా ప్రస్తావన లేదు. ఏ మేరకు చిత్తశుద్ధి ఉన్నా అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఓబిసి కోటా కల్పించడంతోపాటు 2024 ఎన్నికల్లోనే అమలు చేయవచ్చును. మనువాదానికి ఆలంబనగా ఉన్న బీజేపీ ఏనాడు కూడా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపైన స్పందించలేదు. బీజేపీ సిద్ధాంత కర్త ఆర్‌ఎస్‌ఎస్ కూడా పురుషమనువాద సంస్థ. ఆర్‌ఎస్‌ఎస్‌లో మహిళలకు ప్రాథమిక సభ్యత్వం కూడా నిరాకరించడం ద్వారా ఆ సంస్థకు మహిళలకు ఉన్న గౌరవం అర్థమవుతున్నది. నూతన పార్లమెంట్ ప్రారంభంలో మహిళ, గిరిజన రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఆహ్వానించకపోవడమే మహిళలు, గిరిజనులపై బీజేపీకి ఉన్న ప్రేమ

అర్థమవుతున్నది. గోద్రా ఘటనలోని బిల్కిస్‌బానో అత్యాచార కేసులో దోషులకు క్షమాభిక్ష ప్రసాదించడం, వారికి సంఘ్ పరివార్ శక్తులు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలకడం, మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపి లైంగిక వేధిపులకు పాల్పడినా ప్రధాని మౌనంవహించడం, మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం చేసి, నడిరోడ్డులో వివస్త్రలను చేసి ఊరేగించడం బీజేపీ మహిళలపై ఉన్న గౌరవ, మర్యాదలు ఏమిటో తెలుస్తున్నది. గతంలో నల్ల ధనం వెలికితీసి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు, 2020 నాటికి అందరికి సొంత ఇళ్ళు, రైతు ఆదాయం రెండింతలు లాంటి అనేక వాగ్దానాలలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఇండియా పేరు తొలగించి భారత్ పేరుగా నిర్ధారణ చేయడం, జమిలి ఎన్నికల కోసం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవిద్ అధ్యక్షతన కమిటీవేయడం లాంటి అనేక చర్యలు ప్రజల ఆలోచనలను ప్రక్కదారి పట్టించడం కొరకే. తక్షణం జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికలలో ఓటమి భయం, దాని ప్రభావం 2024 పార్లమెంట్ ఎన్నికలలో ఉంటుందనే అనుమానంతో చేపట్టిన చర్యలు మాత్రమే. ఈ స్థితిలో ప్రధానమంత్రి అల్ప రాజకీయాలను పక్కనపెట్టి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన అంశమైనా..మహిళా బిల్లు అంశమైనా మరే అంశమైనా పారదర్శకతతో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రవర్తించవలసి ఉంటుంది.

ఆనాడు 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ కాలంలో అప్పటి ప్రముఖ కమ్యూనిస్టు నాయకురాలు, పార్లమెంట్ సభ్యురాలు గీతా ముఖర్జి నాయకత్వంలో చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ నిర్ధారణ కొరకు జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఆనాడు మహిళలకు 33శాతం రిజర్వేషన్ ప్రతిపాదిస్తూ గీతా ముఖర్జి కమిటి ముసాయిదా బిల్లును తయారుచేయడం జరిగింది. ఆ బిల్లే ఈ రోజు బిజేపి ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకున్నది. కావున ఆ బిల్లుకు గీతా ముఖర్జి పేరును జోడించి "గీతాముఖర్జి మహిళా బిల్లు"గా పేరుపెట్టడం సముచితంగా ఉంటుంది.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

శివమొగ్గ హింస కేసులో 60 మంది అరెస్ట్

- పరిస్థితి అదుపులోనే ఉందన్న పోలీసులు
- హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్న మంత్రి బంగారప్ప

బెంగళూరు/శివమొగ్గ: కర్నాటక రాష్ట్రం శివమొగ్గలో మతపరమైన ఊరేగింపు సందర్భంగా చోటుచేసుకున్న హింసతో సంబంధం ఉన్న కేసులో ఇప్పటి వరకు 60 మందిని అరెస్టు చేసి, 24 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఆదివారం రాళ్ల దాడి ఘటన నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారిన తర్వాత నిషేధాజ్ఞలు విధించిన శివమొగ్గ నగరంలోని రాగి గూడ ప్రాంతంలో ప్రస్తుతం పరిస్థితి శాంతియుతంగా, అదుపులో ఉందని వివరించారు. శివమొగ్గ పోలీసు సూపరింటెండెంట్ జి.కె.మిథున్ కుమార్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'శివమొగ్గ నగరంలో ఎలాంటి ఉద్రిక్తత లేదు. రాగి గుడ్డ ప్రాంతంలో పరిస్థితి ప్రశాంతంగా ఉంది. రాగి గూడ ఘటనకు సంబంధించి 24 కేసులు నమోదు చేసి, 60 మందిని అరెస్టు చేశాము' అని తెలిపారు. హోం శాఖ మంత్రి జి.పరమేశ్వర బెంగళూరులో మాట్లాడుతూ 'అంతా బాగుంది. ఆందోళన చెందవలసిన అవసరం లేదు. దర్యాప్తు జరుగుతోంది. శాంతిభద్రతల ఏడీజీపీని అక్కడకు పంపాము. ఆయన పరిస్థితిని పరిశీలిస్తున్నారు. తిరిగి వచ్చిన తర్వాత నివేదిక సమర్పిస్తారు' అని చెప్పారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, శివమొగ్గ ఇన్‌ఛార్జ్ మంత్రి కూడా అయిన మధు బంగారప్ప మంగళవారం రాగి గూడ ప్రాంతంలో కొన్ని ఇళ్లను పరిశీలించారు. 'ఊరేగింపు సమయంలో తీసుకు వెళ్లినట్లు ఆరోపించబడిన కొన్ని విజువల్స్‌లో కనిపించే కత్తులు 'నిజమైనవి కావు. ప్లాస్టిక్ లేదా కార్డ్‌బోర్డ్‌తో తయారు చేసినవి. మా సంప్రదాయంలో మేము త్రిశూలాన్ని పట్టుకుంటాము. అదే విధంగా ఇక్కడ హింసతో ముడిపెట్టవద్దు. హింసకు పాల్పడితే పోలీసులు చర్యలు తీసుకుంటారు' అని బంగారప్ప తెలిపారు. మిథున్ కుమార్ మాట్లాడుతూ శివమొగ్గ నగరంలో వ్యాపారులు, ఇతర కార్యకలాపాలు సాధారణంగా కొనసాగుతున్నాయన్నారు. 'ఘటన జరిగిన తర్వాత కూడా నగరంలో రాత్రి 11.30 గంటల వరకు ఈద్-మిలాద్ ఊరేగింపు ప్రశాంతంగా జరిగింది. శివమొగ్గ నగర శివార్లలోని రాగి గూడ ప్రాంతంలో మాత్రమే ఈ సంఘటన చూశాను. నేను కూడా వ్యక్తిగతంగా అక్కడ ఉన్నాను. మేము (పోలీసులు) చర్యలు తీసుకుని అరగంటలో పరిస్థితిని అదుపులోకి తెచ్చాము. నిందితులను అరెస్టు చేశాము' అని ఆయన తెలిపారు. రాగి గూడ ప్రాంతంలో మాత్రమే కొన్ని ఆంక్షలు ఉన్నాయని, పరిస్థితిని అంచనా వేసిన తర్వాత ఉపసంహరించుకుంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దోషులను కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ చెప్పారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన సందర్భంగా అన్ని వర్గాలకు చెందిన వారి ఇళ్లపై రాళ్లు రువ్వినట్లు ఆయన గుర్తించారు. 'రాళ్ల దాడి తప్పు అయినందున దోషులు వారి సంఘంతో సంబంధం లేకుండా నేరస్తులే... అమాయకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఫొటోలు, వీడియో ఆధారాలు ఉన్న వారిపై కేసులు నమోదయ్యాయి' అని ఆయన వివరించారు. 'బయటి వ్యక్తుల' ప్రమేయం గురించి, దుండగులు ఓమ్నీ వ్యాన్‌ను ఉపయోగించారనే వార్తలపై మిథున్ కుమార్ స్పందిస్తూ, వాహనాన్ని కనుగొన్నామని, దర్యాప్తు కొనసాగుతోందని, దానిని ఉపయోగించిన వారిని మేము ప్రశ్నించామని చెప్పారు. దీనిపై ఊహాగానాలు చేయవద్దని, ఎలాంటి నిర్ధారణకు వచ్చి ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని, దర్యాప్తు జరుగుతోందని, అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తామని చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం సాయంత్రం ఈద్ మిలాద్ ఊరేగింపుపై రాళ్ల దాడి జరిగిందని వదంతులు రావడంతో ఆగ్రహించిన గుంపు కొన్ని ఇళ్లు, వాహనాలపై రాళ్లు రువ్వి, పోలీసులతో సహా అనేక మందిని గాయపరిచిందని చెబుతున్నారు. గుంపును చెదరగొట్టేందుకు లాఠీఛార్జి చేయవలసి వచ్చిందని తెలిపారు. రాళ్ల దాడి ఘటనకు ముందు ఆదివారం, రాగి గూడ ప్రాంతంలో ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన కటౌట్‌పై నిరసనలు జరిగాయి. ఎందుకంటే 'కొంచెం వివాదాస్పద (విషయం)' కారణంగా పోలీసులు దానిలో కొంత భాగాన్ని కవర్ చేశారు. ఇది సమాజంలోని ప్రజలను కలవరపెడుతుందని పోలీసులు తెలిపారు. మిథున్ కుమార్, ఇతర పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రజలతో చర్చలు జరిపారు. బంగారప్ప మాట్లాడుతూ ఘటనకు పాల్పడిన వారందరిపై చట్ట ప్రకారం వ్యవహరిస్తామని, శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గాంగ్టే కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) కోర్టు సెయిమిన్‌లున్ గాంగ్టే కస్టడీని ఎనిమిది రోజుల పాటు పొడిగించింది. మణిపూర్‌లో శనివారం ఎన్‌ఐఏ అరెస్టు చేసిన గాంగ్టేను ఆదివారం ఢిల్లీ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు గాంగ్టేని రెండు రోజుల పాటు ఎన్‌ఐఏ కస్టడీకి రిమాండ్ చేసింది. కస్టడీ ముగియడంతో మంగళవారం అతడిని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఎన్‌ఐఏ, నిందితుల తరపు న్యాయవాది వాదనలు విన్న తర్వాత ప్రత్యేక ఎన్‌ఐఏ కోర్టు న్యాయమూర్తి సచిన్ గుప్తా నిందితుడికి ఎనిమిది రోజుల పాటు కస్టడీని పొడిగించారు. నిందితుడి తరపు న్యాయవాదికి ఎఫ్ఐఆర్ కాపీని అందజేయాలని కూడా ప్రత్యేక కోర్టు ఎన్‌ఐఏని ఆదేశించింది. తీవ్రవాద నిరోధక చట్టం, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), ఇతర చట్టాల కింద ఎన్‌ఐఏ గాంగ్టేపై కేసు నమోదు చేసింది. మయన్మార్, బంగ్లాదేశ్‌కు చెందిన ఉగ్రవాద గ్రూపులు వివిధ జాతుల మధ్య చీలిక తెచ్చే ఉద్దేశంతో హింసాకాండకు పాల్పడేందుకు భారతదేశంలోని తీవ్రవాద నాయకులతో కలిసి కుట్ర పన్నినట్లు ఎన్‌ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఉగ్రదాడులు ప్లాన్ చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో మయన్మార్, బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థలతో గాంగ్టే సంబంధాలు పెట్టుకున్నట్లు ఎన్‌ఐఏ ఆరోపించింది. గాంగ్టేని చురచంద్‌పూర్ జిల్లాలో అరెస్టు చేశారు. తొమ్మిది రోజుల్లో ఈ కేసులో ఇది రెండో అరెస్టు. అంతకుముందు సెప్టెంబర్ 22న మణిపూర్‌కు చెందిన మొయిరంగ్థెమ్ ఆనంద్ సింగ్‌ను ఎన్‌ఐఏ అరెస్టు చేసింది.

స్విమ్మింగ్ పూల్‌లో మొసలి పిల్ల

ముంబై: ముంబైలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో మొసలి పిల్ల కనిపించింది. దాదర్‌లోని సెంట్రల్ సబర్బ్‌లో ముంబై పౌర సంస్థ బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం తెల్లవారుజామున రెండు అడుగుల పొడవున్న మొసలి పిల్ల కనిపించిందని అధికారులు తెలిపారు. మహాత్మా గాంధీ జలతరణ్ తలావో అనే ఒలింపిక్ సైజు స్విమ్మింగ్ పూల్‌ను సభ్యుల కోసం తెరవడానికి ముందు.. ఉదయం 5.30 గంటల ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు మొసలి పిల్లను గమనించినట్లుగా చెప్పారు. అయితే ఈ విషయంపై సమాచారం అందుకున్న తర్వాత... నిపుణుల సహాయంతో మొసలి పిల్లను క్షేమంగా రక్షించినట్టుగా అధికారులు తెలిపారు. మొసలి పిల్లను సహజ ఆవాసాలలోకి విడిచిపెట్టడానికి అటవీ శాఖకు అప్పగిస్తున్నట్లు బీఎంసీ తెలిపింది. స్విమ్మింగ్ పూల్‌లో మొసలి ఎలా చేరిందో తెలుసుకునేందుకు దర్యాప్తు జరుగుతోందని... దర్యాప్తు ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని బీఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కిషోర్ గాంధీ చెప్పారు. అయితే అక్కడికి సమీపంలోని ప్రైవేట్ జూ నుంచి మొసలి వచ్చి ఉండవచ్చని కొందరు అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని... ప్రైవేట్ జూలోని పాములు రోడ్లపైకి రావడంతో ప్రజలను భయాందోళనకు గురయ్యాని చెబుతున్నారు. ప్రైవేట్ జూపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం: సలీమ్

కోల్‌కతా: మోదీ సర్కారు వ్యవస్థలు, సంస్థలను దుర్వినియోగం చేస్తోందని సీపీఎం పశ్చిమబెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ సలీమ్ మంగళవారం విమర్శించారు. ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్ జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల దాడిని తీవ్రంగా ఖండించారు. కేంద్రం చర్యలపై ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, కాంగ్రెస్, ఆప్, ఎస్పీలతో పాటు సీపీఎం మండిపడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై బీజేపీ గగ్గోలు పెడుతోందని, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎలా చూడాలని సలీమ్ ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను, ఢిల్లీ పోలీసులను మోదీ సర్కారు అడుగడుగునా దుర్వినియోగం చేస్తోందని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు.

కులగణన డిమాండ్లు పక్కదారి పట్టించేందుకే

న్యూస్‌క్లిక్ జర్నలిస్టుల ఇళ్లపై దాడులు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: చైనాతో సంబంధాలున్నాయనే పేరుతో ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్ జర్నలిస్టులు, ఉద్యోగుల ఇళ్లపై ఢిల్లీ పోలీసుల దాడుల ఘటనపై కాంగ్రెస్ స్పందించింది. న్యూస్‌క్లిక్ జర్నలిస్ట్‌లపై ఉదయాన్నే దాడులు చేపట్టడం బీహార్‌లో చేపట్టిన కులగణనలో వెల్లడైన అంశాలపై ప్రభుత్వ నైరాశ్యాన్ని వెల్లడిస్తోందని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. బీహార్ కులగణనలో సంచలన వివరాలు వెలుగుచూడటం, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనే డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో జర్నలిస్టులపై దాడులకు తెగబడి ప్రజల దృష్టి మరల్చే ఎత్తుగడలకు తెరలేపిందని పేర్కొన్నారు. కేంద్ర పాలకుల ముందు ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా వారు తప్పించుకునే ధోరణినే ఆశ్రయిస్తారని ట్విట్టర్ వేదికగా పవన్ ఖేరా ఎద్దేవా చేశారు. ఉగ్రవాద వ్యతిరేక చట్టం, చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణ చట్టం (యూఏపీఏ) కింద ఆగస్టు 17న నమోదైన కేసు ఆధారంగా ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ మంగళవారం ఉదయం ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్‌లోని 30 ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా పోలీసులు వీరి నుంచి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, హార్డ్ డిస్కుల డేటా డంప్స్ సహా ఎలక్ట్రానిక్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితుల చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవచ్చని ఈడీ సమాచారం చేరవేసిన నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టారు.

స్వర్ణ దేవాలయాన్ని సందర్శించిన రాహుల్

అమృత్‌సర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరుసగా రెండో రోజు మంగళవారం పంజాబ్ అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. నీలం రంగు తలపాగా ధరించి ఆలయంలో స్వచ్ఛంద సేవలో పాల్గొన్నారు. ఇతర భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో కూరగాయల చెక్కు ఒలివడం...పాత్రలు శుభ్రం చేయడం వంటి పనులు చేశారు. భజన బృందం సభ్యులతో కూర్చొని కీర్తనలు విన్నారు. రాహుల్ సోమవారం కూడా అమృత్‌సర్ చేరుకున్న తర్వాత స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. ఆయన భక్తులకు నీరు అందించడం, భక్తులు భోజనం చేసిన గిన్నెలను శుభ్రపరిచారు. అనంతరం తాను బస చేస్తున్న హోటల్‌కు వెళ్లారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో మళ్లీ స్వర్ణ దేవాలయానికి వచ్చి భక్తులకు తాగునీరు అందించారు. ఆ సమయంలో భక్తులు రాహుల్‌తో సెల్ఫీ దిగేందుకు ఉత్సాహం చూపించారు. అనంతరం పల్కీ సేవలో పాల్గొన్నారు.

న్యాయసేవలు, న్యాయ కళాశాలల్లో

10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

పాట్నా: న్యాయ సేవలు, ప్రభుత్వ న్యాయ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (ఈడబ్ల్యూఎస్)కు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు బీహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం రాష్ట్ర న్యాయ సేవలు-1951 నిబంధనలకు సంబంధించిన సవరణలను కేబినెట్ ఆమోదించిందని అదనపు చీఫ్ సెక్రటరీ (కేబినెట్ సచివాలయం) ఎస్.సిద్ధార్థ చెప్పారు. నిబంధనల సవరణలతో న్యాయ సేవలు, ప్రభుత్వ న్యాయ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అవకాశం ఏర్పడినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన మంత్రిత్వశాఖ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో 100 పశువైద్య ఆసుపత్రుల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో మొత్తం 100 ప్రథమశ్రేణి పశువుల ఆసుపత్రులు నిర్మిస్తామని, వీటితోపాటు ఆ ఆసుపత్రుల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని సిద్ధార్థ తెలిపారు. ఇందుకోసం రూ.225 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. వినియోగ వ్యవహారాల శాఖకు సంబంధించిన అంశాల పరిష్కారం కోసం 30 అదనపు క్లర్కు పోస్టుల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు.

ముంబైలో 8 లోక్‌సభ స్థానాలపై

శివసేన (యూబీటీ) కన్ను

ముంబై: ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లోని 10 లోక్‌సభ నియోజకవర్గాల్లో 8 స్థానాల్లో పోటీ చేసేందుకు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన వర్గం వచ్చే ఎన్నికల్లో కొంత 'ఇచ్చి పుచ్చుకునే' ధోరణితో పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు మంగళవారం వర్గాలు తెలిపాయి. గత కొద్ది రోజులుగా ఠాక్రే పార్టీ కార్యకర్తలు, నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. మంగళవారం ఆయన ముంబై నార్త్ ఈస్ట్, ముంబై నార్త్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన పదాధికారులతో సమావేశమయ్యారు. 2019లో బీజేపీతో పొత్తుతో పోటీ చేసినప్పుడు శివసేన (అవిభజిత) ముంబైలోని మొత్తం ఆరు లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడింటిని గెలుచుకుంది. ముంబై సౌత్, ముంబై సౌత్ సెంట్రల్, ముంబై నార్త్ వెస్ట్ స్థానాలతో పాటు గత ఎన్నికల్లో కళ్యాణ్, థానే, పాల్ఘర్ స్థానాలను కూడా శివసేన గెలుచుకుంది. అయితే, ముంబై సౌత్ సెంట్రల్, ముంబై నార్త్ వెస్ట్, పాల్ఘర్, కళ్యాణ్ ఎంపీలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు తమ విధేయతను మార్చుకున్నారు. ముంబై నార్త్ ఈస్ట్‌తో పాటు ఎంఎంఆర్ ప్రాంతంలోని ముఖ్యమంత్రి షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే, థానే, పాల్ఘర్, భివాండి స్థానాలు ప్రాతినిధ్యం వహిస్తున్న కళ్యాణ్‌పై శివసేన (యూబీటీ) దృష్టి పెట్టింది. ముంబై నార్త్ ఈస్ట్ మాజీ ఎంపీ సంజయ్ దిన పాటిల్ శివసేన (యూబీటీ) లో చేరారు. 'ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి మేము ఆసక్తిగా ఉన్నాము. ముంబయి నార్త్ సెంట్రల్, ముంబై నార్త్ స్థానాలను ఎన్సీపీ, కాంగ్రెస్ కోసం విడిచిపెట్టడానికి మేము సిద్ధంగా ఉన్నాము' అని శివసేన (యూబీటీ) వర్గాలు తెలిపాయి. గత ఎన్నికల్లో భివాండీ స్థానంలో కాంగ్రెస్ పోటీ చేసిందని, అయితే ఈసారి పోటీ చేసేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని చెప్పారు.

ఉత్తరాదిని వణికించిన భూప్రకంపనలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం తీవ్ర భూప్రకంపనలు సంభవించాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఢిల్లీ-ఎన్సీఆర్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు భూమి బలంగా కంపించింది. ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, ఆఫీసుల నుంచి బయటకు పరుగులు తీశారు. ఉత్తర భారతదేశంలోని అనేక చోట్ల ఈ ప్రకంపనలు సంభవించాయి. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, హాపూర్, అమ్రోహా, ఉత్తరాఖండ్‌లోని అనేక ప్రాంతాల్లో భూమి కంపించింది. పొరుగున ఉన్న నేపాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 2.25 ప్రాంతంలో తొలిసారి భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్సీఎస్) గుర్తించింది. తొలుత అది 4.6 తీవ్రతతో నమోదైంది. పది కిలోమీటర్లు లోతులో అది కేంద్రీకృతమై ఉన్నట్లు ఎన్సీఎస్ పేర్కొంది. ఇది గుర్తించిన అరగంట లోపే... మధ్యాహ్నం 2.51 గంటలకు అంతకంటే ఎక్కువగా 6.2 తీవ్రతతో మరోసారి భూకంపం సంభవించింది. ఇది భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉన్నట్లు ఎన్సీఎస్ గుర్తించింది. ఆ తర్వాత మధ్యాహ్నం 3.06, 3.19 గంటలకు మరో రెండుసార్లు స్వల్ప తీవ్రతతో భూమి కంపించినట్లు ఎన్సీఎస్ తెలిపింది. రెండోసారి చోటుచేసుకున్న భూకంపం తర్వాత ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఇళ్లు, ఆఫీసుల్లో ఉన్న ఫ్యాన్లు, లైట్లు ఊగిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. ఈ ప్రకంపనలపై ఢిల్లీ పోలీసులు సోషల్‌మీడియాలో స్పందించారు. ప్రజలెవరూ కంగారుపడొద్దని, సురక్షిత ప్రదేశాలకు చేరుకోవాలని సూచించారు.

'జనతా ఫ్రీడం ఫ్రంట్'కు అంగీకరించలేదు

దేవెగౌడ



బెంగళూరు: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటక నుంచి బీజేపీతో పొత్తుకు అవగాహన కుదుర్చుకున్న జేడీఎస్ సంచలన విషయం వెల్లడించింది. పూర్వ జనతాదళ్ పార్టీలతో కలిసి "జనతా ఫ్రీడం ఫ్రంట్" ఏర్పాటు కోసం నాలుగు నెలల క్రితం బీహార్ సీఎం నితీశ్ కుమార్ తనను సంప్రదించినట్టు జనతాదళ్ (సెక్యులర్) చీఫ్, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ తెలిపారు. అయితే అందుకు తాను అంగీకరించలేదన్నారు. "నితీశ్ నాలుగు నెలల క్రితం జనతాదళ్ ఫ్రీడం ఫ్రంట్ ప్రతిపాదనతో సంప్రదించారు. నాకు ఇష్టం లేదని చెప్పాను. జాతీయ స్థాయి పదవులపై ఆసక్తి లేదని కూడా చెప్పాను. ఇప్పుడు నా వయస్సు 91. కాంగ్రెస్ పార్టీ ఏవిధంగా వంచనకు పాల్పడిందో చూశాను. ఈ వయసులో ఎలాంటి ప్రయోగాలు చేయాలని నేను కోరుకోవడం లేదు" అని దేవెగౌడ చెప్పారు. జనతాదళ్ నుంచి విడిపోయి సొంత గ్రూపులు పెట్టుకున్న పార్టీలన్నింటిని కలుపుకొని జనతా ఫ్రీడం ఫ్రంట్ ఏర్పాటు చేసే ఆలోచన నితీశ్ కుమార్‌కు ఉండేదని, ఆ ప్రతిపాదననే మూడు-నాలుగు నెలల క్రితం తన ముందుకు తెచ్చారని చెప్పారు. తనను ఒప్పించేందుకు ఆయన పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులను పంపారని, అయితే తాను వారి ప్రతిపాదనను తోసిపుచ్చానని చెప్పారు. ఈ ప్రతిపాదనతో ముందుకు వెళ్లాలంటే ముందుగా మిగతా పార్టీలను కూడా సంప్రదించాల్సి ఉంటుందని తాను సూచించినట్టు చెప్పారు. 'ఇండియా' కూటమి గురించి జేడీఎస్‌తో కాంగ్రెస్ సంప్రదించలేదని కూడా దేవెగౌడ తెలిపారు.

కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై దేవెగౌడ మండిపడ్డారు. రాజకీయాల్లోకి ఆయనను తీసుకువచ్చిందే తానని అన్నారు. ఇంతకంటే తాను మాట్లాడదలచుకోలేదని, తాను ఎంతో బాధకు గురయ్యానని చెప్పారు. బీజేపీకి బీ-టీమ్‌గా జేడీఎస్‌ను రాహుల్ గాంధీ పోల్చడం ఇది రెండో సారని విమర్శించారు. 2018లోనూ ఆయన ఇలాంటి వ్యాఖ్యలే చేశారని చెప్పారు. ఆయన నుంచి తమకు ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం లేదన్నారు. జేడీఎస్ సెక్యులర్ పార్టీ అని, సెక్యులర్ పార్టీలుగా చెప్పుకునే వాళ్ల నుంచి తాము పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

తగ్గిన ఉద్యోగులు...

పెరిగిన పనిభారం

- పీఎస్‌బీల్లో జరగని నియామకాలు
- బ్యాంకుల విస్తరణకు ఆటంకం

న్యూఢిల్లీ: ఉద్యోగులు తగ్గడం, పనిభారం పెరగడంతో ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) పనితీరు ప్రభావితమవుతోంది. ఈ ధోరణి పీఎస్‌బీల ప్రైవేటీకరణకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సంకేతాలిస్తోంది. మరోవైపు ప్రైవేటు రంగ బ్యాంకులు (పీవీఎస్‌బీలు) రాణిస్తున్నాయి. ఉద్యోగులను పెంచుకుంటూ శాఖలను విస్తరిస్తున్నాయి. వినియోగదారుల సంఖ్య, బిజినెస్ పర్ ఎంప్లాయీ... ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎక్కువ కాగా పనిఒత్తిడి కారణంగా ప్రైవేటు రంగ బ్యాంకులతో పోటీ పడలేకపోతున్నాయని అఖిలభారత బ్యాంకు ఉద్యోగులు-అధికారుల సమాఖ్యల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. 2017-22లో పీఎస్‌బీల శాఖలు 7,189కు పరిమితమయ్యాయి. ప్రైవేటు బ్యాంకుల శాఖలు ఐదేళ్లలో 13,211 పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకాలు సముచితంగా జరగని కారణంగా ఉద్యోగులపై పనిభారం పెరిగిందని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం తెలిపారు. పీఎస్‌బీల్లో వినియోగదారుల సంఖ్య అనేకరెట్లు పెరిగిందన్నారు.

ఉద్యోగుల సంఖ్య తగ్గడం వల్ల బ్యాంకుల విస్తరణ పరిమితమన్న అభిప్రాయాన్ని అఖిలభారత బ్యాంకు అధికారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజన్ వ్యక్తంచేశారు. ప్రతి ఉద్యోగి లెక్కన వ్యాపారం (బిజినెస్ పర్ ఎంప్లాయి)లో పెంపుదల పీఎస్‌బీల ప్రైవేటీకరణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సంకేతాలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దశాబ్దంలో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోల్చితే ప్రైవేటురంగ బ్యాంకుల్లో ఉద్యోగులు పెరిగినట్లు చెప్పారు. కేవలం 2023 ఆర్థిక సంవత్సరంలో 98,518 ఉద్యోగులు ప్రైవేటు రంగ బ్యాంకులు కల్పించగా పీఎస్‌బీల్లో 3,385మంది ఉద్యోగులు తగ్గినట్లు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) డేటా తెలిపింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ డేటా ప్రకారం పీఎస్‌బీల్లో బిజినెస్ పర్ ఎంప్లాయి సగటున రూ.23.80 కోట్లు కాగా పీవీఎస్‌బీల్లో రూ.15.02 కోట్లుగా ఉన్నట్లు వెల్లడైంది.

కేరళను ముంచెత్తిన భారీ వర్షాలు

- విద్యాసంస్థల మూసివేత
- అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

తిరువనంతపురం: కేరళ రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి భారీగా వరద నీరువచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు భారీ వర్షం నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం వరద ప్రభావిత ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలను మూసివేసింది. కొట్టాయం, వైకోమ్, చంగనస్సేరి, అలప్పుజాలోని చేర్యాల, చెంగన్నూర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యాసంస్థలకు జిల్లా యంత్రాంగం సెలవు ప్రకటించింది. ఆయా ప్రాంతాల్లో వరదల కారణంగా 17 సహాయక బృందాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో సుమారు 246 మంది వరద బాధితులు ఆశ్రయం పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. కేరళలోని తిరువనంతపురం, కొల్లాం, పతనంతిట్ట, అలప్పుజా, కొట్టాయం జిల్లాల్లో మంగళవారం ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసినట్టు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఈ మేరకు నాలుగు జిల్లాలకు అలర్ట్ ప్రకటించింది. తిరువనంతపురం, కొల్లాం, పతనంతిట్ట, అలప్పుజ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా హై రేంజ్‌లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది.

'మహా' మృత్యు ఘోష

- నాందేడ్ ఆస్పత్రిలో మరో ఏడుగురి మృతి
- రెండు రోజుల్లో 31కి చేరాయన్న అధికారులు
- ఛత్రపతి సంభాజీనగర్ ఆస్పత్రిలో 18 మరణాలు
- సమగ్ర దర్యాప్తు జరపాలి : కాంగ్రెస్ డిమాండ్

ఔరంగాబాద్/ముంబై : మహారాష్ట్రలో మృత్యుఘోష కొనసాగుతోంది. నాందేడ్ ఆస్పత్రిలో మరో ఏడుగురు రోగులు మృత్యువాత పడగా, దీనికితోడుగా ఛత్రపతి సంభాజీనగర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో 24 గంటల్లో 18 మరణాలు సంభవించాయి. ఈ మరణాలపై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. నాందేడ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో 24 గంటల్లో 24 మంది రోగులు మరణించినట్లు వెలుగులోకి వచ్చిన ఒక రోజు తర్వాత, అక్టోబరు 1, 2 మధ్య అదే ఆస్పత్రిలో మరో ఏడు మరణాలు సంభవించినట్లు అధికారులు మంగళవారం ధ్రువీకరించారు. ఇక్కడికి 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాందేడ్ జిల్లా సమాచార కార్యాలయం (డీఐవో) దీనిని సామాజిక మాధ్యమ వేదికలో ధ్రువీకరించింది. 48 గంటల్లో ఆస్పత్రిలో మరణించిన రోగుల మొత్తం సంఖ్య 31కి చేరినట్లు పేర్కొంది. అంతకుముందు, నాందేడ్‌లోని డాక్టర్ శంకర్‌రావ్ చవాన్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో సెప్టెంబరు 30, అక్టోబరు 1 మధ్య 24 గంటల్లో 24 మరణాలు నమోదయ్యాయి. మరణించిన 24 మందిలో 12 మంది శిశువులు అని మహారాష్ట్ర ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి సోమవారం తెలిపారు. సామాజిక మాధ్యమ వేదికలో నాందేడ్ డీఐవో మాట్లాడుతూ డాక్టర్ శంకర్‌రావ్ చవాన్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో రోగుల మరణానికి సంబంధించిన వాస్తవాలు ఇలా ఉన్నాయి. సెప్టెంబరు 30-అక్టోబరు 1 మధ్య 24 మరణాలు, అక్టోబరు 1, 2 మధ్య ఏడు మరణాలు సంభవించాయి' అని పేర్కొన్నారు. 'దయచేసి భయపడవద్దు. వైద్యుల బృందం సిద్ధంగా ఉంది' అని వెల్లడించింది. కాగా, మహారాష్ట్ర వైద్య విద్యాశాఖ మంత్రి హసన్ ముష్రీఫ్ మంగళవారం నాందేడ్‌లోని జీఎంసీహెచ్‌ని సందర్శించనున్నారు. ఆయన ఆస్పత్రిని సందర్శించిన తర్వాత విలేకరుల సమావేశంలో కూడా ప్రసంగిస్తారని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. సోమవారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో నాందేడ్ జిల్లా కలెక్టరేట్ సెప్టెంబరు 30, అక్టోబరు 1 మధ్య ఆస్పత్రిలో మొత్తం 24 మరణాలు నమోదయినట్లు పేర్కొన్నారు. 'ప్రాణాలను కోల్పోయిన 12 మంది పెద్దలలో ఐదుగురు పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. నలుగురు పెద్దలకు గుండె సంబంధిత వ్యాధులు ఉన్నాయి. ఒకరు తెలియని విషం తాగి బాధపడుతున్నారు. ఒకరికి కాలేయ సమస్య ఉంది. ఇద్దరు కిడ్నీ రోగులు, ఒక కేసు ప్రెగ్నెన్సీ సమయంలో తలెత్తిన సమస్య, మూడు ప్రమాద కేసులు నమోదయ్యాయి' అని పేర్కొంది. మృతి చెందిన శిశువుల్లో నలుగురిని చివరి దశలో ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు కలెక్టరేట్ ప్రకటనలో పేర్కొంది.

నాందేడ్ తర్వాత...

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి (జీఎంసీహెచ్) లో మంగళవారం ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల్లో కనీసం 18 మరణాలు నమోదయ్యాయని ఒక అధికారి తెలిపారు. 'ఛత్రపతి సంభాజీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో అక్టోబరు 2 ఉదయం 8 నుంచి అక్టోబరు 3 ఉదయం 8 గంటల మధ్య 18 మరణాలు నమోదయ్యాయి' అని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పీటీఐకి తెలిపారు. జీఎంసీహెచ్‌లో నమోదయిన 18 మరణాలలో ఇద్దరు రోగులు గుండె పోటుతో మరణించగా, మరో ఇద్దరు న్యూమోనియాతో, మరో ముగ్గురు కిడ్నీ విఫలం చెంది, మరొకరు కాలేయం సమస్యతో బాధపడుతూ, ఒకరు కాలేయం, కిడ్నీ సమస్యతో, రోడ్డు ప్రమాదంలో, విషప్రయోగం, అపెండిక్స్ తర్వాత ఇన్ఫెక్షన్ కారణంగా ఒక్కొక్కరు చొప్పున మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆరో రోజు (అక్టోబరు 2-3 మధ్య) ఇద్దరు శిశువులు మరణించారు. 'వారు శిశువులు, ఒక్కొక్కరు 1,300 గ్రాముల బరువు మాత్రమే ఉన్నారు' అని ఆయన వివరించారు. ఇదిలాఉండగా, నాందేడ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో జరిగిన మరణాలపై ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

పిల్లలకు మందులకు డబ్బు లేదా? : బీజేపీ సర్కార్‌పై రాహుల్ ధ్వజం

మహారాష్ట్రలోని నాందేడ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో జరిగిన 31 మరణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ మంగళవారం డిమాండ్ చేసింది. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని ప్రశ్నించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. సామాజిక మాధ్యమం హిందీలో చేసిన పోస్ట్‌లో, ఖడ్గే ఆస్పత్రి మరణాలపై తన ఆందోళనను వ్యక్తం చేశారు. 'ఈ రోగులు మందులు, చికిత్స లేకపోవడం వల్ల మరణించారని చెప్పారు. 2023 ఆగస్టులో థానేలోని ప్రభుత్వాస్పత్రిలో ఇదే విధమైన సంఘటన జరిగింది. ఇందులో 18 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు' అని ఖడ్గే వివరించారు. 'బాధిత కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి. పదేపదే జరుగుతున్న ఇలాంటి సంఘటనలు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మహారాష్ట్రలోని బీజేపీ-శివసేన ప్రభుత్వాన్ని విమర్శించారు. 'ఈ నిర్లక్ష్యానికి కారణమైన దోషులను న్యాయవ్యవస్థ కఠినంగా శిక్షించేలా సమగ్ర దర్యాప్తును మేము డిమాండ్ చేస్తున్నాము' అని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రచారం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే పిల్లల మందులకు ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం రాత్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ మాట్లాడుతూ 31 మంది రోగులు, వారిలో 16 మంది శిశువులు లేదా పిల్లలు చనిపోయారని, 'అయినా ప్రధాని పూర్తిగా మౌనంగా ఉన్నారని' అని అన్నారు. 'కొద్ది వారాల క్రితం, థానే జిల్లాలోని ఒక ఆస్పత్రిలో ఇలాంటి భయంకరమైన విషాదం జరిగింది. మహారాష్ట్ర ప్రభుత్వానికి ఒక సీఎం, ఇద్దరు సీఎంలు వేచి ఉన్నారు. మరికొంతమంది వేచి ఉన్న సీఎంలతో మిగులు ఉంది' అని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'కానీ ఈ చట్టవిరుద్ధ ప్రభుత్వంలో సున్నా జవాబుదారీతనం ఉంది. దీనికి ప్రధానమంత్రి, మహారాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఆపరేషన్‌ను రూపొందించినవారు బాధ్యత వహించాలి' అని జైరాం రమేశ్ అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం 'ఎక్స్' పోస్ట్‌లో అధిక సంఖ్యలో మరణాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని ఆమె కోరారు. కాగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరణ వార్తలపై తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'బీజేపీ ప్రభుత్వం తన ప్రచారానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది, కానీ పిల్లలకు మందులకు డబ్బు లేదా? బీజేపీ దృష్టిలో పేదల ప్రాణాలకు విలువ లేదు' అని ఆరోపించారు.

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి 6.3 శాతం

ప్రపంచ బ్యాంక్ అంచనా

న్యూదిల్లీ/వాషింగ్టన్: పెట్టుబడులు, దేశీయ డిమాండ్ సహాయంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ప్రపంచ భౌగోళిక సవాళ్లు ఎదురవుతున్నా భారతదేశం స్థితిస్థాపకతను ప్రదర్శిస్తూనే ఉందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023-24) 6.3 శాతం వృద్ధి నమోదు కావచ్చొని పేర్కొంది. పెట్టుబడులకు అనుకూల వాతావరణం, దేశీయ డిమాండ్ ఇందుకు కారణమని, అదే సమయంలో ద్రవ్యోల్బణ అంచనాలను మాత్రం సవరించి 5.9 శాతంగా నమోదు కావచ్చని వెల్లడించింది. తదుపరి రెండేళ్ల పాటు పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి 6.4 శాతం, 6.5 శాతం చొప్పున నమోదు కావొచ్చని పేర్కొంది. ఒకవైపు అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ... జి20 దేశాల్లో వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలుస్తుందని, అభివృద్ధి చెందుతున్న సగటు దేశాల కంటే రెట్టింపు వేగంతో దూసుకువెళుతోందని వివరించింది. దక్షిణాసియా ప్రాంతంలో అత్యధిక భాగాన్ని కలిగి ఉన్న భారతదేశంలో 2023-24లో వృద్ధి 6.3 శాతం వద్ద పటిష్టంగా ఉంటుందని తెలిపింది. ద్రవ్యోల్బణంపై, నివేదిక ప్రకారం, ఆహార ధరలు సాధారణీకరణ, ప్రభుత్వ చర్యలు కీలకమైన వస్తువుల సరఫరాను పెంచడంలో సహాయపడతాయి. అందువల్ల ఇది క్రమంగా తగ్గుతుందని అంచనా వేసింది. ఈ సంవత్సరం దక్షిణాసియా 5.8 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు ప్రపంచ బ్యాంక్ తెలిపింది. భారతదేశంలో 2023 మొదటి అర్ధభాగంలో బలమైన ఉత్పత్తి వృద్ధికి పెట్టుబడి బలమైన విస్తరణ, రంగాల స్థాయిలో, సేవల నిరంతర బలం మద్దతునిచ్చిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రభుత్వ అవస్థాపన ప్రాజెక్టులు నిర్మాణ రంగంలో ఊపందుకుంటున్నాయి. ఇది ఇటీవలి త్రైమాసికాల్లో సంవత్సరానికి దాదాపు 10 శాతం వృద్ధిని సాధించింది. 'ప్రపంచ వృద్ధి మందగమనం వల్ల తక్కువ ప్రభావం చూపిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కన్సల్టింగ్ వంటి సేవల బలమైన ఎగుమతుల నుంచి ఎగుమతి వృద్ధి ప్రయోజనం పొందింది' అని పేర్కొంది. ప్రపంచంలోని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశ ప్రాంతం కంటే ఇది అధికం, కానీ మహమ్మారి ముందు ఉన్న దాని కంటే నెమ్మదిగా, దాని అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి తగినంత వేగంగా లేదు. అంతకుముందు, ఏప్రిల్ నెల సమీక్షలో భారత వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ తగ్గించింది. 6.6 శాతంగా ఉన్న అంచనాలను 6.3 శాతానికి కుదించింది.

9 నుంచి విద్యుత్ భారాలపై ప్రచారం

వామపక్షాల నిర్ణయం

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు కొనసాగింపుగా అక్టోబర్ 9 నుండి వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేపట్టాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం విజయవాడ దాసరి భవన్(సీపీఐ రాష్ట్ర కార్యాలయం)లో సీపీఐ(ఎంఎల్) నాయకులు జె.కిషోర్‌బాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సీపీఐ తరపున కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, అక్కినేని వనజ, సీపీఎం తరపున వి.శ్రీనివాసరావు, ఎంఏ గఫూర్, వి.ఉమామహేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తరపున డి.హరనాథ్; సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నుంచి పి.ప్రసాద్, ఎంసీపీఐ నుంచి ఎస్‌కే ఖాదర్‌బాషా హాజరయ్యారు. ప్రజలపై మోపిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 9 నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల పంపిణీ, పేటలు, వీధి సమావేశాలు జరపాలని, ప్రజా బ్యాలెట్లు నిర్వహించి ప్రజల వ్యతిరేకతను కూడగట్టాలని సమావేశం నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో వామపక్ష పార్టీలు సమావేశమై నిర్దిష్టంగా ఆయా జిల్లాలలో కార్యక్రమాలు రూపొందించుకొని అమలు చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఎన్ఐఏ తెలుగు రాష్ట్రాలలో వివిధ ప్రజాసంఘాల నాయకుల ఇళ్లపైన, మంగళవారం న్యూస్‌క్లిక్ మీడియా సంస్థ, దాని జర్నలిస్టుల నివాసాలపై జరిపిన దాడులను సమావేశం తీవ్రంగా ఖండించింది. వర్షాభావంతో రాష్ట్ర వ్యాపితంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కరువు నివారణ చర్యలకు వెంటనే పూనుకోవాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరిస్తానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీని అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసులు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేసింది.

రాహుల్ రైలు ప్రయాణం

బిలాస్‌పూర్ నుంచి రాయ్‌పూర్‌కు...

న్యూదిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం బిలాస్‌పూర్ నుంచి రాయ్‌పూర్ వరకు తన రెండు గంటల రైలు ప్రయాణానికి సంబంధించిన ఒక చిన్న వీడియోను విడుదల చేశారు. దీనిని పార్టీ భారత్ జోడో యాత్ర కొనసాగింపుగా, దేశాన్ని ఏకం చేయడానికి పార్టీ మాజీ అధ్యక్షుడు చేస్తున్న ప్రయత్నాలను అభివర్ణించింది. గాంధీ ఇటీవల ఛత్తీస్‌గఢ్ పర్యటన సందర్భంగా సెప్టెంబరు 25న తన ప్రయాణానికి సంబంధించిన వీడియోను కూడా పంచుకున్నారు. ఆయనతో పాటు ప్రయాణిస్తున్న వారిలో ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ కూడా ఉన్నారు. 'కోట్ల మంది ప్రజలను వారి గమ్యస్థానాలకు చేరవేస్తూ, దేశంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ, భారతీయ రైల్వేలు నిజంగా భారతదేశానికి ప్రతిబింబం' అని రాహుల్ 'ఎక్స్' పోస్ట్‌లో చేశారు. ఆయనను ఉటంకిస్తూ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. 'రైల్వేలు భారతదేశానికి జీవనాధారం. దీనిలో ప్రతిరోజూ సుమారు 1 కోటి మంది ప్రజలు ప్రయాణిస్తారు. రైలులో నిజమైన భారతదేశం సంగ్రహావలోకనం కనిపిస్తుంది. వివిధ మతాలు, భాషలు, తరగతుల ప్రజలు ఒకరితో ఒకరు అపరిచితులుగా ప్రారంభించినప్పుడు ఒకరితో ఒకరు అనుబంధం కలిగి ఉంటారు, ప్రేమను పంచడానికి దుకాణాలు తెరవబడతాయి, భారతదేశం ఏకం అవుతుంది' అని ఆయన పేర్కొన్నారు. బిలాస్‌పూర్ నుంచి రాయ్‌పూర్ ప్రయాణం 'చిరస్మరణీయమైనది' అని అభివర్ణించిన గాంధీ, తాను ఛత్తీస్‌గఢ్‌లో చాలా మంది ప్రతిష్టాత్మక యువకులను కలుసుకుని మాట్లాడానని, ముఖ్యంగా క్రీడాకారులను వాగ్దానం చేశానని చెప్పారు. 'వారి దృష్టిలో చాలా కలలు ఉన్నాయి. అవి నెరవేరుతాయని వారు విశ్వసించారు. వారి అంచనాలు, పోరాటాలపై చర్చించారు' అని చెప్పారు. 'నేను దళిత సమాజం నుండి వచ్చిన ఒక అమ్మాయిని కూడా కలిశాను. ఆమె చేసిన కళను చూసి నేను చాలా సంతోషించాను. ఆమె చాలా ప్రతిభ కలిగిన కళాకారిణి' అని అన్నారు. రెండు గంటలు క్షణికావేశంలో గడిచిపోయాయని పేర్కొన్న కాంగ్రెస్ నాయకుడు, 'ఈ సామరస్యం, ఆనందం దేశమంతటా వ్యాపించాలని, ప్రయాణాలు ప్రేమతో నిండిపోవాలని, అందరి ప్రయాణం శుభప్రదంగా ఉండాలని, భారతదేశం ఐక్యంగా కొనసాగాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

పారుల్ చౌదరి, అన్నురాణి అసమాన ప్రతిభ

స్వర్ణ పతకాలతో అదరగొట్టిన భారత అథ్లెట్లు

హంగ్జౌ: చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అదరగొడుతున్నారు. 3000 మీటర్ల స్టీపెల్‌ఛేజ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన పారుల్ చౌదరి, మంగళవారం 5000 మీటర్ల మహిళల పరుగు పందెంలో స్వర్ణం గెలిచింది. అలాగే జావెలిన్ త్రోయర్ అన్ను రాణి ఆసియా క్రీడల్లో సంచలన ప్రదర్శన కనబర్చింది. అదిరిపోయే త్రో విసిరి పసిడి పతకం చేజిక్కించుకుంది. ఈ సీజన్ లోనే తన అత్యుత్తమ త్రో నమోదు చేసిన అన్ను రాణి జావెలిన్‌ను 62.92 మీటర్ల దూరం విసిరి బంగారు పతకం అందుకుంది. అన్ను రాణి తన నాలుగో ప్రయత్నంలో ఈ సూపర్ త్రో విసిరింది. 61.57 మీటర్లతో శ్రీలంక క్రీడాకారిణి నదీష దిల్హాన్ రజతం గెలుచుకుంది. చైనాకు చెందిన హుయిహుయి ల్యూ 61.29 మీటర్లతో కాంస్యం దక్కించుకుంది. కాగా అన్ను రాణి గెలుచుకున్న స్వర్ణంతో, ఆసియా క్రీడల్లో భారత్ పసిడి పతకాల సంఖ్య 15కి పెరిగింది. ఇక మిక్స్‌డ్ 4×400 రిలే పోటీల్లో రజతం గెలిచిన విథ్యా

రామ్‌రాజ్, మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం గెలిచింది. 39 ఏళ్ల కిందట ఆసియా క్రీడల్లో పతకం గెలిచిన పరుగుల రాణి పీటీ ఉష రికార్డును సమం చేసింది కోయం బత్తూర్ ఎక్స్‌ప్రెస్ విథ్యా రామ్‌రాజ్. పురుషుల కనోయ్ డబుల్ 1000 మీటర్ల ఫైనల్‌లో భారత జోడీ కాంస్య పతకం సాధించింది. అర్జున్ సింగ్, సునీల్ సింగ్‌తో కూడిన భారత జట్టు 3:53.329 సెకన్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో 3:43.796 సెకన్లతో ఉజ్బెకిస్థాన్ బంగారు పతకాన్ని సొంతం చేసుకోగా, 3:49.991 సెకన్లతో రెండో స్థానంలో నిలిచిన కజకిస్థాన్ రజతం గెలుపొందింది. కాగా, ఈ విభాగంలో భారత్‌కు పతకం రావడం ఇదే మొదటిసారి.

బాక్సింగ్ 75కేజీల విభాగం ఫైనల్స్‌లో లవ్లీనా

బాక్సింగ్ విభాగంలో భారత్‌కు ఇప్పటికే రెండు పతకాలు దక్కగా మరో పతకం ఖాయమైంది. మహిళల 75 కేజీల విభాగంలో భారత బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ ఫైనల్లో అడుపెట్టింది. ఆసియా క్రీడల్లో ఫైనల్‌కు చేరడం ద్వారా ఆమె 2024లో జరుగనున్న పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖాయం చేసుకున్నట్లయింది. బాక్సింగ్‌లో ఒలింపిక్స్ పతక విజేత, ప్రపంచ చాంపియన్ అయిన లవ్లీనా మంగళవారం జరిగిన సెమీ ఫైనల్లో థాయ్‌లాండ్ బాక్సర్ బాయ్‌సన్ మనీకోన్‌పై విజయం సాధించి బుధవారం జరగనున్న ఫైనల్స్‌కు చేరింది. ఇక 19 ఏళ్ల ప్రీతి పవార్ కూడా మంగళవారం జరిగిన 54 కేజీల బాక్సింగ్ సెమీస్‌లో ఓటమి చవి చూసినప్పటికీ కాంస్య పతకం అందుకుంది. సెమీస్‌కు చేరడం ద్వారా పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖాయం చేసుకుంది. సెమీస్‌లో ప్రీతి చైనాకు చెందిన చాంగ్ యువాన్‌తో తలపడింది. అద్భుత పోరాట పటిమ చూపినప్పటికీ ప్రీతి 0-5 స్కోరుతో ఓడిపోయింది.

పురుషుల స్క్వాష్ సింగిల్స్‌లో భారత స్క్వాష్ ప్లేయర్ సౌరవ్ గోషల్ సెమీ ఫైనల్‌కి దూసుకెళ్లాడు. 57 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరిన భారత బాక్సర్ సచిన్ సివాచ్ 1-4 తేడాతో ఓడిపోయాడు. స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో అనహాత్- అభయ్ జోడి, కొరియన్ జోడిపై 2-1 విజయం అందుకుని సెమీస్ చేరింది. అలాగే మరో భారత స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్ జోడి దీపికా పల్లికల్-హరీందర్ పాల్ సింగ్ కూడా సెమీస్ చేరుకున్నారు. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు.

సెంచరీతో అదరగొట్టిన యశస్వి జైస్వాల్ : సెమీస్‌లో టీమిండియా

పురుషుల క్రికెట్‌కు సంబంధించి టీమిండియా సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా 23 పరుగుల తేడాతో నేపాల్ జట్టుపై గెలుపొందింది. భారత జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. టాప్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ యశస్వి జైస్వాల్ సెంచరీ కొట్టాడు. కేవలం 49 బంతుల్లో అతను ఏడు సిక్స్‌లు, 8 ఫోర్లతో సరిగ్గా వంద పరుగులు చేసి ఔటయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(25)తో కలిసి జైస్వాల్ తొలి వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయిదో వికెట్‌కు శివం దూబే, రింకూ సింగ్‌లు అజేయంగా 52 పరుగులు జోడించారు. రింకూ సింగ్ తన పవర్ గేమ్‌తో ఆకట్టు కున్నాడు. రింకూ సింగ్ 15 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 37 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆ తర్వాత భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన నేపాల్ జట్టు... 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. భారత బౌలర్లు రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్‌లు చెరి మూడు వికెట్లు పడగొట్టారు.

మన ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-మచిలీపట్నం: తెలుగుదేశం-జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం వారాహి యాత్ర రెండో రోజులో భాగంగా స్థానిక సువర్ణ కళ్యాణ మండపంలో జనవాణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా, చేయగలమా లేమా అనే ఆలోచన కూడా లేకుండా వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. జనవాణి కార్యక్రమాన్ని నేను ఎక్కడ నిర్వహిస్తున్నా ప్రజలు ప్రభుత్వ వాగ్దానాల్లో మోసపోయిన వినతి పత్రాలు ఎక్కువగా తన దృష్టికి వస్తున్నాయని తెలిపారు. చేతకాని వాగ్దానాలు చేసిన జగన్‌ను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు పట్టాభి మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ సభ్యులు పవన్‌కు వినతి పత్రం అందజేశారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణంపై పాలకుల తీరును ఈ సందర్భంగా పవన్ ఎండగట్టారు. జాతికి గుర్తింపు తెచ్చిన నాయకులను గౌరవించడం మనందరి బాధ్యత అని, ఆంధ్రా బ్యాంకును యూనియన్ బ్యాంకులో విలీనం చేస్తున్నప్పుడు మన ఎంపీలు పోరాడకపోవడం సిగ్గుచేటని అన్నారు. పెడనకు చెందిన చేనేత కార్మికులు వారి సమస్యపై పవన్ కళ్యాణ్‌కు వినత పత్రం అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నారని, ముఖ్యంగా వర్షం పడిన సమయంలో మగ్గాల వద్ద నీరు చేరి కార్మికులు అనేక అవస్థలు గురైన సంఘటనలు తాను అనేకమార్లు చూశానని చెప్పారు. తెలుగుదేశం-జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బధిరులు తమ సమస్యలపై పవన్‌ను కలిశారు. మచిలీపట్నంలోని జ్యువెలరీ పార్కులో అనేక కుటుంబాలు జీవిస్తున్నాయని, ఎన్నికల వాగ్దానాల్లో స్థానిక నాయకులు నీటి సమస్య లేకుండా ఇంటికి ఒక కుళాయి అందజేస్తామని, డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా తమ సమస్యలు పరిష్కరించలేదని పోతేపల్లి ప్రజలు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే పవన్ ఈ విషయమై స్పందిస్తూ ఇంటింటికీ కుళాయి పథకంలో కేంద్ర ప్రభుత్వం పథకమని, దాని వాటా మొత్తంలో కొంత రాష్ట్ర ప్రభుత్వం భరించాలన్నారు. అయితే ఆ విధంగా భరించకపోవడం వలన ఈ పథకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయిందని తెలిపారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరించే మార్గాన్ని అన్వేషిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్‌కు స్థానికులతో పాటు స్థానికేతరులు కూడా వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్, బండి రామకృష్ణ, జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయ పర్యాటకానికి ప్రాచుర్యం

ప్రముఖ దేవాలయాల్లో మాసోత్సవాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఆలయ పర్యాటకాని (టెంపుల్ టూరిజం)కి విస్తృత ప్రాచుర్యాన్ని కల్పించేందుకు అన్ని ప్రముఖ దేవాలయాలు మాస పత్రికలను ప్రచురించేలా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాల యంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో మాదిరి రాష్ట్రంలోనూ టెంపుల్ టూరిజానికి ప్రాచుర్యం కల్పించేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటామన్నారు. దేవాదాయ ధర్మాధాయ శాఖ పరంగా ఇప్పటికే ఆరాధన అనే మాస పత్రికను ప్రచురిస్తున్నామని, దీనికి 32 వేలకు పైగా చందాదారులు ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో అన్ని దేవాలయాల ప్రాశస్త్యాన్ని, విశేషాలను, అనేక దేవాలయాల్లో జరిగే విశేష కార్యక్రమాలతో పాటు ప్రముఖ ప్రవచన కర్తలైన చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావు, సామవేదం షణ్ముకశర్మ తదితరులతో ధర్మసందేహాలకు సరైన సమాధానాలను ఈ పత్రికలో ప్రచురించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడలోని దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం వారు కనకదుర్గ ప్రభ మాసపత్రికను, శ్రీశైల దేవస్థానం వారు శ్రీశైలప్రభ మాసపత్రికను ప్రచురిస్తున్నారని చెప్పారు. భక్తులకు అవసరమగు ఆధ్యాత్మిక సమాచారాన్ని మరింత విస్తృత స్థాయిలో ఆయా మాస పత్రికల్లో ప్రచురించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశామన్నారు. ప్రముఖ దేవాలయాలైన అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి, కాణిపాకం తదితర దేవాలయాల అధ్వర్యంలో నూతనంగా మాస పత్రికలను ప్రచురించేందుకు ఆదేశాలను జారీ చేశామని చెప్పారు. సనాతన హిందూ ధర్మం ప్రాముఖ్యతను, ప్రాశస్త్యాన్ని నేటి తరానికి తెలియజేయాలనే లక్ష్యంతో మాసోత్సవాలను ఆగస్టు 6 న అన్నవరంలోను, 16వ తేదీన శ్రీకాళహస్తిలోను, సెప్టెంబరు 14 న కాణిపాకం విఘ్నేశ్వర ఆలయంలో ప్రారంభించామని తెలిపారు. దసరా పండుగ అనంతరం తదుపరి విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయంలోను, ద్వారకా తిరుమల, సింహాచలం, శ్రీశైలం, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయాల్లోనూ ఈ మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉత్తరాంధ్ర జిల్లాల్లో తొలుత ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రాయలసీమ జిల్లాల్లోనూ నిర్వహించనున్నామని చెప్పారు.

భారత్-నెదర్లాండ్స్ ప్రాక్టీస్ మ్యాచ్ వర్షార్పణం



తిరువనంతపురం: వన్డే ప్రపంచకప్ కోసం మంగళవారం భారత్-నెదర్లాండ్స్ మధ్య జరగాల్సిన ప్రాక్టీస్ మ్యాచ్ రద్దు అయింది. వర్షం కారణంగా ఆ మ్యాచ్‌ను రద్దు చేశారు. కేరళలోని తిరువనంతపురంలో ఏకధాటిగా వర్షం పడడంతో మ్యాచ్‌ను మొదలు పెట్టలేకపోయారు. సాయంత్రం నాలుగు గంటలకు పిచ్‌ను పరిశీలించిన తర్వాత మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. వర్షానికి గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం చిత్తడిగా మారింది. సూపర్ సోపర్లకు పనిపెట్టినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది అడపాదడపా జల్లులు పడడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.